
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 19.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కానిస్టేబుల్ ప్రకాశ్ రిపోర్టింగ్ సర్..!



పోలీసుల బకాయిలు చెల్లించాలని వైసీపీ ప్రభుత్వాన్ని నిలదీసి.. ఉద్యోగాన్ని కోల్పోయిన ఏఆర్ కానిస్టేబుల్ ప్రకాష్.. తిరిగి విధుల్లోకి చేరారు. డీజీపీ ఆదేశాల మేరకు ఎస్పీ జగదీష్ ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉత్తర్వుల కాపీని, ఓ పుష్పగుచ్ఛాన్ని తీసుకుని సోమవారం ఉదయం ఆయన డీపీఓకు వచ్చారు. మూడేళ్ల తరువాత యూనిఫాంలో వేసుకుని.. ఎస్పీకి రిపోర్టు చేసుకున్నారు. న్యాయం చేయమన్నందుకు జగన్ తనను ఉద్యోగం నుంచి తొలగించారని, అప్పట్లో భరోసా ఇచ్చిన సీఎం చంద్రబాబు తనకు న్యాయం చేశారని ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు.

(వివరాలు మెయిన్ 13లో..)

కదిలిన కుడికాలువ గేట్లు

- కాలువకు నీరు విడుదల
- రెండు బృందాల జాయింట్ ఆపరేషన్
- ఊపిరి పీల్చుకున్న అధికారులు
- గేటు మరమ్మతులకు నిధులు

కూడేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడికాలువ గేట్లు ఎట్టకేలకు సోమవారం పైకి లేచాయి. దీంతో కాలువకు నీరు వదిలారు. గతనెల 25న కుడికాలువకు నీరు వదులుతామని ప్రకటించిన నీటిపారుదల అధికారులు గేట్లను ట్రయల్ రన్ చేశారు. రెండుగేట్లు పైకి లేవలేదు. దీంతో ఖంగుతిన్న వారు వివిధ ప్రాంతాలకు చెందిన నిపుణులు, సంబంధిత మెకానిక్‌లను పిలిపించి, ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవడంతో విజయవాడలోని చీఫ్ ఇంజనీరింగ్ సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీఈ సీడీఓ) విభాగానికి సమాచారం పంపారు. ఐదు రోజుల క్రితం ఆ విభాగ ఈఈ విజయసారథి, సలహాదారు కృష్ణారావు గేట్లను పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌కు చెందిన ఆనందరాజ్, సీఈ సీడీఓ విభాగానికి చెందిన శ్రీనివాసులు బృందాలకు సమాచారం పంపారు. సోమవారం రెండు బృందాలు జాయింట్ ఆపరేషన్ చేసి, ఎట్టకేలకు గేట్లను కాస్త పైకి లేపాయి. దీంతో కాలువకు 500 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. దీంతో ఇరిగేషన్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

కన్నయ్య నాయుడు బృందం ఆపరేషన్‌తోనే..

గతేడాది తుంగభద్ర డ్యాం 19వ నంబరు గేటు కొట్టుకుపోయిన విషయం విదితమే. ఆ స్థానంలో గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు బృందం స్టాప్ లాగ్ ఎలిమెంట్స్‌ను విజయవంతంగా అమర్చింది. పీఏబీఆర్ కుడికాలువ గేట్లను పైకి ఎత్తడంలోనూ అదే బృందం పనిచేసినట్లు ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. వారం రోజులుగా కుడికాలువ గేటుతో పాటు అత్యవసర గేటు కూడా పైకి లేవకపోవడంతో ఆందోళన చెందిన అధికారులు.. నిపుణులకు సమచారం పంపారు. దీంతో తుంగభద్ర డ్యాం గేటు అమర్చిన కన్నయ్యనాయుడు బృందంలోని హోస్పేట్‌కు చెందిన ఆనందరాజ్‌కు సమాచారం ఇచ్చారు.

రెండో గేటు ఎత్తి 8 గంటల తర్వాత..

పీఏబీఆర్ ప్రధాన గేట్లలో ఇప్పటికే ఒక దాని ద్వారా 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. సోమవారం ఉదయం రెండో గేటు ఎత్తారు. సాయంత్రం కుడికాలువ గేటు పైకి లేవడంతో ఇరిగేషన్ అధికారులు 8 గంటల తర్వాత రెండోగేటు బంద్ చేశారు. ప్రస్తుతం డ్యాం ప్రధాన గేటు నుంచి 560 క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తోంది. డ్యాంలో నీటిమట్టం 435.650 మీటర్ల వద్దకు చేరుకుంది. నీటి నిల్వ 5.300 టీఎంసీలకు చేరింది.



గేటు పైకి లేవడంతో కుడికాలువలో ప్రవహిస్తున్న నీరు

ఆనందరాజ్ బృందం రంగంలోకి దిగింది. రెండు గేట్లను పైకి ఎత్తింది. దీంతో కాలువకు నీరు విడుదలైంది. నీటి పారుదల శాఖ ఎస్ఈ సుధాకర్‌రావు, ఈఈ శశికళ, డీఈ వెంకటరమణ తదితరులు కుడి కాలువలో ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు.

గేట్లు బంద్ చేసి నీటి వృథాను అరికట్టండి

జెన్‌కో అధికారులకు ఇరిగేషన్ వర్గాల సూచన

జల విద్యుదుత్పత్తి నిలిపి వేసిన జెన్‌కో అధికారులు గేటు కిందికి దింపే ప్రయత్నం చేశారు. గేటు కిందికి దిగకపోవడంతో దాదాపు 250 క్యూసెక్కుల నీరు వృథాగా వెళ్తోంది. జెన్‌కో అధికారులు గేటు దించాలని సోమవారం ఇరిగేషన్ సిబ్బం.. సంబంధిత జెన్-కో కార్యాలయానికి వెళ్లారు. అక్కడ సంబంధిత అధికారులు లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమచారం పంపారు. గేటును దించేందుకు రెండ్రోజుల్లో నిపుణులు వస్తున్నారని జెన్‌కో అధికారులు.. ఇరిగేషన్ వర్గాలకు చెప్పినట్లు తెలిసింది

మరమ్మతులు చేయకపోవడంతోనే..

పీఏబీఆర్‌లో 1990 సంవత్సరంలో అమర్చిన గేట్లకు ఇంతవరకు మరమ్మతులు చేయలేదు. నీటి విడుదల సమయంలో మాత్రమే గేట్లవైపు చూసే అధికారులు తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు. 35 ఏళ్లుగా కుడికాలువ, జల విద్యుదుత్పత్తి కేంద్రం గేట్లకు మరమ్మతులు చేయలేదు. ఇదే ప్రస్తుత దుస్థితికి కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నిధుల విడుదల

పీఏబీఆర్ కుడికాలువ గేట్ల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రూ.29 లక్షల నిధులు విడుదల చేసింది. గత వైసీపీ పాలకులు పీఏబీఆర్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. డ్యాంలోని వివిధ రకాల పనులకు నివేదికలు పంపడమే తప్ప.. నిధులిచ్చింది లేదు. ఈ నేపథ్యంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవతో కుడికాలువ గేటు మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందనీ, డ్యాంలో నీరు తగ్గితే పనులు చేపడతారని అధికారులు తెలిపారు.



కుడికాలువ గేటుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

32 ఏళ్లకు దొరికాడు..!



నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బస్సు దోపిడీ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చి అదృశ్యమైన నిందితుడిని పోలీసులు 32 ఏళ్ల తరువాత అరెస్టు చేశారు. కర్ణాటకలోని పావగడకు చెందిన నరసింహులును కూడేరు పోలీసులు సోమవారం అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచారు. 1992లో కూడేరు-జల్లిపల్లి గ్రామాల మధ్య ఆర్టీసీ బస్సు దోపిడి జరిగింది. మదనపల్లి డిపో ఆర్టీసీ బస్సు బళ్లారి వైపు వెళుతుండగా.. ముగ్గురు దొంగలు బస్సును ఆపారు. కత్తులు చూపించి బెదిరించి, ప్రయాణికుల నుంచి బంగారం, నగదు దోచుకుని పారిపోయారు. కండక్టర్ వెంకట చలపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ముగ్గురు నిందితులను అప్పట్లో అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై విడుదలయ్యాక మూడో నిందితుడు నరసింహులు కోర్టుకు హాజరు కాలేదు. తప్పించుకుని తిరుగుతుండటంతో కోర్టు నాన్ బెయిల్ బుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు గుంతకల్లు డీఎస్పీ పర్యవేక్షలో కూడేరు సీఐ రాజు, సిబ్బంది.. చెన్నేకొత్తపల్లిలో ఉంటున్న నిందితుడి కుటుంబంపై నిఘా వేశారు. ఇంటికి వచ్చినట్లు గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

- ఆంధ్రజ్యోతి, కూడేరు



శునక మాత..!

ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరు అవుతారని అంటారు. మనుషుల సంగతేమోగానీ, గొర్రెల మందలో పెరిగి ఓ శునకం గొర్రెగా మారిపోయింది. గొర్రె పిల్లలకు పాలిచ్చి పెంచుతోంది. ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామానికి చెందిన సోము అనే గొర్రెల కాపరి ఓ కుక్కను పెంచుకున్నాడు. ఇది నాలుగు గొర్రె పిల్లలకు తరచూ పాలు ఇస్తూ ఆశ్చర్యపరుస్తోంది. మందపై క్రూర మృగాలు దాడి చేయకుండా కాపాడే పెంపుడు కుక్కలు, గొర్రెల జోలికి వెళ్లవు. అవి దారి తప్పకుండా చూసుకుంటాయి. కానీ ఈ శునకం ఏకంగా గొర్రె పిల్లలకు పాలిచ్చి పెంచుతోంది.

- ఆంధ్రజ్యోతి, ఆత్మకూరు

మేనమామే హంతకుడు

- పథకం ప్రకారమే బాలుడి హత్య
- నిందితుడి అరెస్ట్: డీఎస్పీ

- వివరాలు 7లో...

టన్ను రూ.లక్ష

మూడు నెలల్లోనే దానిమ్మ ధర పెరుగుదల... రైతుల్లో ఆనందం

- వివరాలు 6లో...

మూడు ఓవర్లు.. రూ.లక్షల్లో బెట్టింగులు

- ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు పందెం
- ధర్మవరం క్రీడామైదానంలో యథేచ్ఛగా క్రికెట్ బెట్టింగ్

7

ఉరవకొండ డిప్యూటీ ఎంపీడీఓకు షోకాజ్

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు కార్యదర్శులకు కూడా..

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఉరవకొండ డిప్యూటీ ఎంపీడీఓతో పాటు మరో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీపీఓ నాగరాజనాయుడు సోమవారం తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా నిర్ణీత గడువులోపు అర్జీలకు తగిన పరిష్కార మార్గాలు చూపడంలో నిర్లక్ష్యం వహించినందుకుగానూ డిప్యూటీ ఎంపీడీఓతో పాటు ఇద్దరు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. ఈమేరకు ఉరవకొండ డిప్యూటీ ఎంపీడీఓ సతీష్‌కుమార్, తాడిపత్రి మండలం చిన్నపొలమడ పంచాయతీ కార్యదర్శి బలరామమూర్తి, విడపనకల్లు మండలం హవళిగి పంచాయతీ కార్యదర్శి రామక్రిష్ణకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని అన్నారు. జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటి పనులు అప్పుడు పూర్తి చేసేలా చూడాలని ఆయన సూచించారు.

కలెక్టర్ ఆదేశాలు తూచ్..!

- నవంబరు పాయె.. డిసెంబరు వచ్చె..
- సైన్స్ సెంటర్ సందర్శనకు విద్యార్థులు ఏరీ?
- రోజుకు 300మంది పిల్లలు.. రవాణాచార్జీలు..
- భోజన వసతి అన్నారు.. అమలయ్యేనా?



జిల్లా సైన్స్ సెంటర్

అనంతపురం విద్య, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా సైన్స్ సెంటర్ కళ తప్పింది. అటువైపు వెళ్లేవారు లేకుండా పోయారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆనంద్.. సైన్స్ సెంటర్‌కు పూర్వవైభవం తేవాలని భావించారు. అందులోని పరిజ్ఞానం విద్యార్థులకు చేరువయ్యేలా చూడాలన్నారు. జిల్లావ్యాప్తంగా రోజూ 300 మంది విద్యార్థులు సైన్స్‌సెంటర్‌కు వచ్చి ఇక్కడి ప్రాజెక్టులను తిలకించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాగూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ఉంది. విద్యార్థులకు ఎస్ఎస్ఏ ద్వారా రవాణాచార్జీలు చెల్లించేలా సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు అధికారి (ఎస్పీడీ)తో కలెక్టర్ మాట్లాడి, ఆమోదం వేయించారు. సైన్స్‌సెంటర్ సందర్శనకు వచ్చిన విద్యార్థులకు ఇస్కాన్ ద్వారా మధ్యాహ్న భోజనం అందించేలా ఏర్పాటు చేశారు. దీంతో సైన్స్ సెంటర్‌కు పూర్వవైభవం వస్తుందని అందరూ ఆశించారు. అధికార యంత్రాంగం మాత్రం ఆ దిశగా పట్టించుకోవట్లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ ఆదేశించినపుడు మాత్రం వెంటనే అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యాశాఖ అధికారులు హడావుడి చేశారు తప్ప.. ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నెల దాటినా..

సైన్స్ సెంటర్‌ను రోజూ విద్యార్థులు సందర్శించేలా చూడాలని అధికారులకు కలెక్టర్ ఆనంద్ టార్గెట్ పెట్టారు. దీంతో నవంబరు 1వ తేదీ నుంచే సైన్స్ సెంటర్‌ను విద్యార్థులు సందర్శించేలా చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ అధికారులు, సైన్స్ సెంటర్ అధికారి చెప్పారు. విద్యార్థులకు రవాణాచార్జీలు ఇస్తారనీ, పిల్లలను తీసుకురావడానికి ఆర్టీసీ యాజమాన్యానికి బస్సుల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరామన్నారు. భోజనం అందించేలా ఇస్కాన్ ప్రతినిధులతో చర్చించామని చెబుతూ వచ్చారు. ఇలా నవంబరు ముగిసిపోయింది. డిసెంబరు కూడా వచ్చింది. నేటికీ కలెక్టర్ ఆదేశాలు అమలుకావట్లేదు.

సైన్స్ ఆఫీసర్ తీరు వివాదాస్పదం

జిల్లా సైన్స్ సెంటర్ పర్యవేక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా జిల్లా సైన్స్ ఆఫీసర్‌ను నియమించింది. ఇందుకు బెళుగుప్ప మండలంలోని ఓ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయుడిని నియమించింది. ఆయన పాఠశాలకు వెళ్తానే అవసరమైనపుడు సైన్స్ సెంటర్‌కు వచ్చి పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఆ హెచ్ఎం బడివైపు వెళ్లడమే గగనమంట. ఎవరైనా అడిగితే తాను జిల్లా సైన్స్ ఆఫీసర్‌ను అనీ, తనకు అనేక పనులుంటాయనీ, బడికి రావాలని తనను అడగకూడదంటూ బుకాయిస్తారట. ఈయన సంగీత విభావరి గ్రూపును ఏర్పాటు చేసుకుని, పాటలు పాడుతుంటారు. వైసీపీ హయాంలో డీఈఓను సంగీత విభావరికి తీసుకెళ్లి, పాటలు పాడించడం చేస్తూ ఆయనను తనగుప్పిట్లో పెట్టుకొని వ్యవహారాలు నడపారట. పైగా తాను పాడిన పాటలు, డ్యాన్సులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సైన్స్ గ్రూపులలో పోస్టు చేస్తారని తెలుస్తోంది. దీనిని ఓ టీచర్ తప్పుబడితే ఇష్టం లేకపోతే గ్రూప్ నుంచి వెళ్లవచ్చని మెస్సేజ్ పెట్టాడంటే.. ఆయన తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇతర శాఖలతో మాట్లాడుతున్నాం: ప్రసాద్‌బాబు, డీఈఓ

సైన్స్ మ్యూజియాన్ని విద్యార్థులు సందర్శించేలా చూడాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చిన విషయం వాస్తవమే. రోజుకు 300మందికి తగ్గకుండా విద్యార్థులు వచ్చేలా చూడాలని సూచించారు. ఆమేరకు విద్యార్థులను సందర్శనకు తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. పిల్లలకు సైన్స్‌సెంటర్‌తోపాటు నగరంలోని ఆర్కియాలజీ సెంటర్, పర్యాటక ప్రాంతాలను చూపించేలా చూడాలని సూచించారు. ఆమేరకు ఆర్కియాలజీ, టూరిజం శాఖల అధికారులతో మాట్లాడుతున్నాం. దీంతో ఆలస్యమవుతోంది.

ఇంటి వద్దే పింఛన్ ఇవ్వాలి: కలెక్టర్



వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

బుక్కరాయసముద్రం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును లబ్ధిదారుల ఇళ్ల వద్దే సిబ్బంది పంపిణీ చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. ఒకటో తేదీ తీసుకోని వారికి మంగళవారం పంపిణీ చేయాలని సూచించారు. మండలంలోని రేకలకుంట గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ చేశారు. పింఛన్ పంపిణీపై లబ్ధిదారులతో ఆరాతీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ సాల్మన్, ఎంపీపీ సునీత పాల్గొన్నారు.

తొలిరోజు రూ.118.03 కోట్లు పంపిణీ

అనంతపురం అర్బన్: జిల్లావ్యాప్తంగా తొలిరోజు 2,65,418 మందికి రూ.118.03 కోట్ల పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు. మొత్తం ఈ నెలకు సంబంధించి జిల్లాలోని 2,78,905 మంది లబ్ధిదారులకు రూ.124.43 కోట్ల పింఛన్ సొమ్ము మంజూరు చేశారు. తొలిరోజు పింఛన్ తీసుకోని వారికి స్థానిక సచివాలయాల్లో మంగళవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పంపిణీ చేస్తారని డీఆర్‌డీఏ పీడీ శైలజ తెలిపారు.

అర్జీల వెల్లువ

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు ఏకంగా 437 అర్జీలు సమర్పించారు. కలెక్టర్ ఆనంద్ వాటిని స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... గడువులోపే అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరిమెట్ల ఎల్లన్న కోరారు. జిల్లాలో మొక్కజొన్న, వరి, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు బీహెచ్ రాయుడు కోరారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజల్లో భరోసా నింపండి: ఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్టేషన్లకు వచ్చే ప్రజలకు తమ సమస్యలను పోలీసులు పరిష్కరిస్తారనే భరోసా నింపాలని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ వచ్చిన ప్రజలతో ముఖాముఖి మాట్లాడి అర్జీలు స్వీకరించారు. మొత్తం 115 అర్జీలు వచ్చాయి. తర్వాత ఎస్పీ జగదీష్ సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రజల నుంచీ వచ్చిన వాటికి చట్టపరిధిలో పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ఐలకు సన్మానం

ఉద్యోగ విరమణ చేసిన ఇద్దరు ఏఎస్ఐలను ఎస్పీ ఘనంగా సన్మానించారు. ట్రాఫిక్ ఏఎస్ఐ సత్యనారాయణ, గార్లదిన్నె మహబూబ్ బాషా ఉద్యోగ విరమణ చేయడంతో పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఇలియాస్ బాషా, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఆర్ఐలు మధు, పవన్‌కుమార్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఊరంతా దిగులు..!

- రిజర్వాయర్‌పై గుడిపల్లిలో సమావేశం
- మంత్రి సవితకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయం



సజ్జగంట రంగనాథస్వామి ఆలయం ఎదుట సమావేశమైన గ్రామస్థులు

సోమందేపల్లి, అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఆ ప్రాంతంలో నీటి అవసరాలు పెరిగాయి. దీంతో అక్కడున్న చెరువును విస్తరించి, రిజర్వాయర్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో తమ ఊరు మాయమైపోతుందని అక్కడి జనం దిగులు చెందుతున్నారు. ఇప్పటికే పరిశ్రమల కోసం భూములను త్యాగం చేశామని, ఇప్పుడు ఊరిని కూడా కోల్పోతామని ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యను మంత్రి సవిత దృష్టికి తీసుకువెళ్లి, తమకు న్యాయం చేయాలని కోరాలని నిర్ణయించారు. సోమందేపల్లి మండలం గుడిపల్లి ప్రజలు గ్రామంలోని సజ్జగంట రంగనాథస్వామి ఆలయంలో సోమవారం రాత్రి సమావేశమయ్యారు.

అభివృద్ధి అవసరాలకు..

హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కాలవ పరిధిలో పందిపర్తి (గుడిపల్లి) రిజర్వాయర్ నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపారు. సోమందేపల్లి మండలం గుడిపల్లి వద్ద (పందిపర్తి) రిజర్వాయర్ నిర్మించాలని తలంచారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వానికి రూ.600 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపారు. హంద్రీనీవా పరిధిలోని మడకశిర బ్రాంచ్ కెనాల్ కింద 52వ కి.మీ. వద్ద పందిపర్తి రిజర్వాయర్‌లోకి నీటిని వదిలే విధంగా ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ముందుకు సాగలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక గత ఏడాది ఆ అంచనాలను రూ.760 కోట్లకు పెంచి పంపారు. దీన్ని ప్రభుత్వం ఈ ఏడాది వెనక్కు పంపింది. ప్రస్తుత

(మిగతా 6వ పేజీలో)

నిధుల వరద

- అమృత్ నిధులకు మోక్షం
- గుంతకల్లులో వేగంగా అభివృద్ధి పనులు
- మారనున్న పట్టణ రూపురేఖలు


కసాపురం రోడ్డులో వంతెన వద్ద నిర్మిస్తున్న మురుగు కాలువ

గుంతకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఓ వైపు అమృత్ నిధులు విడుదల కాగా, మరోవైపు 15వ ఆర్థిక సంఘ నిధులతో పనులు చేపట్టనున్నారు. ఇవేకాక.. గత ప్రభుత్వ హయాంలో టెండర్లు పూర్తయినా చేపట్టని పనులను రద్దు చేశారు. వాటికి మళ్లీ టెండర్లు నిర్వహించి పనులు చేపట్టారు. వీటికి తోడు ఎమ్మెల్యే పలు వార్డుల్లో పర్యటించి సత్వరం చేపట్టాల్సిన పనుల జాబితాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అమృత్ పథకానికి గతంలో నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వ వాటాను ప్రస్తుత ప్రభుత్వం చెల్లించడంతో కేంద్రం నుంచి కొత్తగా నిధులు విడుదలయ్యాయి. అలాగే అమృత్ ఫేజ్-2 కింద పబ్లిక్ హెల్త్ విభాగం ద్వారా తాగునీటి ట్యాంకులు, పైప్‌లైన్లకు భారీగా నిధులు రావడంతో త్వరలో ఆ పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కానున్నాయి.

అమృత్ నిధుల వెల్లువ

అమృత్ ఫేజ్-1 కింద రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సి ఉన్న కాంట్రిబ్యూషన్ నిధులను గత ప్రభుత్వం నిలిపివేయడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాంటు ఆగిపోయింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అమృత్ పథకానికి తన కాంట్రిబ్యూషన్ కింద 30 శాతం నిధులను ఇవ్వడంతో కేంద్రం నుంచి రావాల్సిన 60 శాతం నిధులకు సంబంధించిన ప్రతిబంధకాలు తొలిగాయి. వీటికి మునిసిపాలిటీ నుంచి 10 శాతం నిధులు చేర్చి పెండింగులో ఉన్న అమృత్ వర్కులను చేపట్టారు. దీంతో పట్టణంలో నిర్మాణ దశలో నిలిచిపోయిన మురుగునీటిని శుభ్రపరచడానికి సీవేజ్ ట్రీట్మెంటు ప్లాంట్ (ఎస్టీపీ) పనులను మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు పునరుద్ధరించారు. రోజుకు 80 లక్షల లీటర్ల మురుగునీటిని శుభ్రపరచడానికి రూ.26 కోట్లతో చేపట్టిన ఎస్టీపీ పనులను కాంట్రాక్టు కంపెనీ ద్వారా పునఃప్రారంభింపజేశారు. అమృత్ ఫేజ్-2 కింద పట్టణంలో తాగునీటి వ్యవస్థను మెరుగుపరచడానికి రూ. 23.54 కోట్లతో పబ్లిక్ హెల్త్ శాఖ ఆధ్వర్యంలో టెండరు ప్రక్రియను చేపట్టారు. భాగ్యనగర్‌లో 1,300 కేఎల్ సామర్థ్యం ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం, సమ్మర్ స్టోరేజి ట్యాంకు వద్ద రోజుకు 90 లక్షల లీటర్ల నీటిని శుద్ధి చేసే ఫిల్ట్రేషన్ ప్లాంటు నిర్మాణం, పట్టణంలో దాదాపు 16 కి.మీ.ల తాగునీటి పైప్‌లైన్ నిర్మాణానికి ఈ టెండర్లను నిర్వహించారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను ప్రభుత్వం అమృత్ పథకానికి మళ్లించింది. తాగునీటి అవసరాల కోసం రూ.18.58 వ్యయం చేయనున్నారు. వీటితో పాటు పట్టణంలో డ్రెయిన్లు, రోడ్లు, తాగునీటి పైపులైన్లు, వార్డుల్లో చేపట్టాల్సిన పనులపై శాసనసభ్యుడు గుమ్మనూరు జయరాం ప్రతిపాదించిన పనులకు ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపారు.


సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంటు పనులు చేస్తున్న దృశ్యం

నిలిచిన పనులకు మోక్షం

పట్టణంలో అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దృష్టి సారించారు. బిల్లుల చెల్లింపు జరుగుతుందని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించారు. పట్టణంలోని సత్యనారాయణపేట రైల్వే వంతెన సమీపంలో మురుగు కాలువ అత్యంత అధ్వానంగా ఉండటంతో రూ.10 లక్షలతో డ్రెయిన్ నిర్మాణాన్ని చేపట్టారు. రాజేంద్రనగర్‌లోని మెయిన్ రోడ్డు నుంచి వెంకటేశ్వరాలయం వరకూ అధ్వానంగా ఉన్న రహదారి పనులను రూ.10 లక్షలతో చేపట్టారు. ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీ నిర్మాణానికిగానూ పైప్‌లైన్ డైవర్షన్ పనులను చేపట్టి పూర్తిచేయించారు. మోదినాబాద్‌లోని ప్రధాన రహదారిలో రూ.16 లక్షలతో డ్రెయిన్ నిర్మాణం, బ్యాంకు కాలనీలో రూ. 5 లక్షలతో డ్రెయిన్, పాతగుంతకల్లు నుంచి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓహెచ్‌టీ వరకూ పైపులైన్ నిర్మాణం రూ.40 లక్షలతో చేపట్టి పూర్తిచేశారు. జనరల్ ఫండ్ నుంచి రూ.75 లక్షలతో కల్వర్టుల నిర్మాణం, పార్కుల అభివృద్ధి పనులకు కౌన్సిల్ అనుమతి పొందారు.



శరవేగంగా అభివృద్ధి పనులు

గుంతకల్లు పట్టణంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నాం. త్వరలో 15వ ఆర్థిక సంఘ నిధులు, అమృత్-2 నిధులతో పనులు ప్రారంభించనున్నాం. పనులు పూర్తయితే పట్టణంలో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ, రహదారులు మెరుగుపడతాయి. ధర్మవరం గేటు వద్ద స్థలాలు కోల్పోయినవారికి పరిహారం చెల్లించి మావంతు సహకారం అందిస్తాం.

-నయ్యీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ఆగిన పనులనూ ప్రారంభించాం

బిల్లు చెల్లింపుల విషయంగా కొందరు కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. ఆ పనుల్లో స్పందించని కాంట్రాక్టర్ల పనులను రద్దుచేశాం. ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభింపజేశాం. ఎమ్మెల్యే చొరవతీసుకుని బిల్లుల చెల్లింపులకు మార్గం సుగమం చేయడంతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రజా వేదిక ద్వారా పలు వార్డుల్లో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సూచించిన పనులకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేస్తాం.

-ఇంతియాజ్ అలీ, మున్సిపల్ కార్యనిర్వాహక ఇంజనీర్



పరిశ్రమల సృష్టికర్త చంద్రబాబు

- అర్హులకు పక్కాగృహాలు మంజూరు చేస్తాం
- రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత
- సానిపల్లిలో పింఛన్ల పంపిణీ


దివ్యాంగుడికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న మంత్రి

రొద్దం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల సృష్టికర్త అని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం రొద్దం మండలంలోని సానిపల్లిలో వృద్ధులు, వికలాంగులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినెలా ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. కియా లాంటి పరిశ్రమలో వేలాది మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఎంఎస్ఎంఈలతో రాష్ట్రానికి కుప్పలు తెప్పలుగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ

గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు మంజూరు చేస్తామనీ మంత్రి సవిత అన్నారు. సోమవారం రొద్దంలోని వెలుగు కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఫిర్యాదుల దినోత్సవం నిర్వహించారు. ప్రజా సమస్యలపై వందలాది మంది తరలిరాగా మంత్రి ప్రతి ఒక్కరి సమస్య వింటూ సంబంధిత శాఖాధికారులతో సమస్యకు పరిష్కారం చూపారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, తహసీల్దార్ ఉదయశంకర్‌రాజు, ఎంపీడీఓ ఆనంద్ ప్రసాద్, టీడీపీ నాయకులు మాధవనాయుడు, వెంకటరామిరెడ్డి, వీరాంజనేయులు, హరీష్, పవన్, శ్రీనాథ్‌చౌదరి, అరుణ్‌కుమార్ రెడ్డి, అశ్వత్థనారాయణ, తిరుపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


అరటికి గిట్టుబాటు ధర కల్పించాలి

- శైలజానాథ్ డిమాండ్
- కలెక్టరేట్ ముందు నిరసన
- రైతుల్లేకుండానే ఆందోళన


మీడియాతో మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అరటి పంటకు ధరలు లేక రైతులు నష్టపోతున్నారనీ, వారికి న్యాయం చేయాలని మాజీ మంత్రి, వైసీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. వైసీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం అరటి పండ్లను రోడ్డుపై వేసి నిరసన తెలిపారు. రైతుల్లేకుండానే నిరసన చేపట్టడం గమనార్హం. వైసీపీ నాయకులు, కార్యకర్తలు మినహా రైతులెవరూ కనిపించలేదు. వైసీపీ నాయకులు మనుగడ కోసం షోలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థాయిలో సైతం పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులే కనిపించారు తప్ప.. రైతులు లేరు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ.. అరటి కిలో రూ.2 నుంచి రూ.3కి విక్రయిస్తున్నారన్నారు. రైతులు ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టారనీ, పంట కోత సమయంలో కనీసం ఆ డబ్బు కూడా చేతికి రావడం లేదన్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. అరటి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలనీ, లేదంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేసేలా చూడాలని కోరారు. అనంతరం నాయకులతో కలిసి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. నిరసన సమయంలో వైసీపీ నాయకులు, పోలీసుల మధ్య వాగ్వాదం తలెత్తింది. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, నాయకులు గువ్వల శ్రీకాంత్ రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, శ్రీరామిరెడ్డి, గోకుల్‌రెడ్డి, పూల ప్రసాద్, రాజు, శ్రీనివాసనాయక్, గొర్ల మారుతీనాయుడు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై ఉపాధ్యాయుడి చిత్రం



రామగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మండలంలోని పేరూరు మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల టీచర్ శ్రీరాములు గీసిన చిత్రం ఆలోచింపజేస్తోంది. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం ఈ చిత్రాన్ని గీశారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మూలించాలనీ, దీనిపై అవగాహన పెంచాలని చిత్రం ద్వారా చెప్పారు.

టన్ను రూ. లక్ష

- మూడు నెలల్లోనే అమాంతం పెరుగుదల
- దానిమ్మ రైతుల్లో ఆనందం


విరగ్గాసిన దానిమ్మ

పుట్లూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దానిమ్మ రైతులకు మంచి రోజులు వచ్చాయి. ఇంతకాలం భారీగా పెట్టుబడులు పెట్టి పంటలు తీసినా.. సరైన ధరలు లేక ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఇటీవల దానిమ్మ ధరలు నెమ్మదిగా పెరుగుదల ప్రారంభమయ్యాయి. మూడు నెలల క్రితం టన్ను ధర రూ.50వేల నుంచి రూ. 60వేల వరకు ఉన్నాయి. ప్రస్తుతం టన్ను దానిమ్మ ధర లక్ష రూపాయల నుంచి రూ.1.10 లక్షల వరకు పలుకుతోంది. దీంతో గతంలో పెట్టుబడులకు చేసిన అప్పులను తీర్చుకోవచ్చని రైతులు ఆశిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 13,381 ఎకరాల్లో దానిమ్మ సాగుచేస్తున్నారు. పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, యాడికి, తాడిపత్రి, నార్పల, రాప్తాడు తదితర మండలాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల్లో దిగుబడి ఆలస్యం

ఇతర రాష్ట్రాల్లో దానిమ్మ దిగుబడి ఆలస్యం కావడంతోనే మన రాష్ట్రంలో ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఆ రాష్ట్రాల్లో పంట రావడానికి సుమారు రెండునెలలు పడుతుందని తెలుస్తోంది. దీంతో మన దానిమ్మపండ్లకు డిమాండ్ పెరిగినట్లు సమాచారం. గుజరాత్, మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల్లో పంట ఆలస్యమవుతున్నట్లు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అక్కడి వ్యాపారులు సైతం కొనుగోలు చేసేందుకు మన రాష్ట్రానికి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

టన్ను ధర రూ.లక్షపైగానే..

మూడు నెలల క్రితం దానిమ్మ ధరలు టన్ను రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు మాత్రమే పలికాయి. ప్రస్తుతం టన్ను రూ.లక్ష నుంచి రూ.1.10 లక్షల వరకు పలుకుతోంది. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే రైతులకు పంట చేతికి వస్తోంది. ధరలు ఆశించిన స్థాయిలో ఉన్నప్పుడే అమ్ముకుంటే అప్పులు తీరుతాయని పలువురు అమ్మకాలకు సిద్ధమవుతున్నారు. దానిమ్మపండ్లను తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.



ఈ ధరలు రెండు నెలలు కొనసాగాలి

నేను 15ఎకరాల్లో దానిమ్మ పంటను సాగుచేస్తున్నాను. మూడు నెలల కిందట పోలిస్తే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ధరలు ఇంకా రెండునెలలు కొనసాగితే బాగుంటుంది. మన ప్రాంతంలో ఇప్పుడిప్పుడే పంట చేతికి వస్తోంది. గతంలో చాలామంది రైతులకు పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొంది.

- రామచంద్రయాదవ్, రైతు, ఎ.కొండాపురం

గతంలో పెట్టుబడులు కూడా రాలేదు

గతంలో ధరలు సరిగా లేక పెట్టుబడులు కూడా రాక నష్టపోయాను. నాలుగు ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశాను. అప్పట్లో టన్ను రూ.60వేలలోపు అమ్మాల్సి వచ్చింది. దిగుబడి బాగా వచ్చినా కొన్నిసార్లు ధరలు అమాంతం తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం ధరలు మాత్రం పెరిగాయి. ఈ ధరలు ఇలాగే కొనసాగితే రైతుల కష్టాలు తీరుతాయి.

- శివశంకర్‌రెడ్డి, రైతు, కందికాపుల



ఊరంతా దిగులు..!

(5వ పేజీ తరువాయి)

స్టాండర్డ్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్ (ఎస్ఎస్ఆర్) ప్రకారం అంచనాలను పెంచుతూ, రూ.875 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గుడిపల్లి చెరువునే పందిపర్తి రిజర్వాయర్‌గా, 3 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నీటిని పెనుకొండ సమీపంలో ఉన్న కియ, కియ అనుబంధ సంస్థలు, అనేక పరిశ్రమలకు సరఫరా చేయాలని, చెరువు కింద ఉన్న 700 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని, ప్రజల తాగునీటి అవసరాల తీర్చాలని ఈ రిజర్వాయర్‌కు రూపకల్పన చేశారు.

వ్యతిరేకం కాదు.. అయినా..

ఇప్పటికే భూములను కోల్పోయిన తాము, రిజర్వాయర్‌ను నిర్మిస్తే ఊరిని కూడా కోల్పోతామని గుడిపల్లి జనం ఆవేదన చెందుతున్నారు. గతంలో నాసిన్, బెల్‌తోపాటు గుడిపల్లి పారిశ్రామికవాడకోసం వందల ఎకరాల భూములను ప్రభుత్వానికి ఇచ్చామని గుర్తు చేసుకున్నారు. తమను మాటమాత్రంగానైనా అడగకుండా, గ్రామసభ నిర్వహించకుండా రిజర్వాయర్ నిర్మిస్తామని ప్రకటనలు చేస్తున్నారని వాపోయారు. తమకు సహాయ, పునరావాసం గురించి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని, గ్రామంలో ఎన్ని ఇళ్లుంటే అన్నింటిని వేరేచోట ప్రభుత్వం నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇంటికో ఉద్యోగం, 2013 చట్టం ప్రకారం పరిహారం అందించాలని కోరారు. బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేయడానికి మంగళవారం వస్తున్న మంత్రిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశంలో గ్రామస్థులు పెద్ద సుబ్బన్న, ముద్దప్ప, బెస్త సజ్జప్ప, రమణప్ప, నడింపల్లి లక్ష్మయ్య, రంగనాథ్, నాగమణి, అలివేలమ్మ, హరిక్రిష్ణ, సురేష్, శ్రీనివాసులు, సూరీ, అల్లం రమేష్, నారాయణప్ప, సోమశేఖర్, రఘునాథ్‌రెడ్డి, వెంకటరమణప్ప, కిష్టప్ప, సుధాకర్, రమణ, అల్లం మూర్తి, ఎస్ఆర్ వెంకటరప్ప, ఎల్‌బి రంగనాథ్, వెంకటరమణస్వామి, సజ్జారెడ్డి, రామాంజినేయులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

- ఒక్కో విద్యార్థిపై రూ.90 వేల ఖర్చు
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఏడాది ఒక్కో విద్యార్థిపై రూ.90 వేలు ఖర్చు చేస్తోందని తెలిపారు. మండలంలోని బూదగవి గ్రామంలో ఆర్ఎంఎస్ఏ కింద రూ.43.75 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన సోమవారం ప్రారంభించారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. అంతకుమునుపు గ్రామంలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కాసేపు సరదాగా గడిపారు. పాఠాలను చదివించి, విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ పాలనలో పాఠశాలలు నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును తయారు చేశామని, అభివృద్ధికి రూ.33 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి, ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే అన్ని రంగాలలోనూ రాణించవచ్చునని అన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని సూచించారు. భయాన్ని పక్కన పెడితే ప్రపంచంలో ఎక్కడైనా రాణించగలిగే అవకాశం ఉంటుందని అన్నారు. మంత్రి వెంట ఎస్ఎస్ఏ ఏసీ శైలజ, తహసీల్దారు మహబూబ్‌బాషా, ఎంపీడీవో రవిప్రసాద్, టీడీపీ నాయకులు విజయ్‌భాస్కర్, దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, కుళ్లాయప్ప, చిరంజీవి, నాగేంద్ర తదితరులు ఉన్నారు.


అదనపు గదుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

పన్నుల శాఖలో ఉద్యోగోన్నతులు

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖలో ఇరువురు అధికారులకు ఉద్యోగోన్నతులు కల్పించడంతో పాటు బదిలీ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ భాస్కర్‌వల్లికి జాయింట్ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విశాఖపట్నం-1కు జాయింట్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో సూర్యాపేటలో సీటీఓ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి పొందిన షెహనాజ్‌బేగంను నియమించారు. తాడిపత్రి సీటీఓగా ఉన్న సోనియా తారకు డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విజయవాడ-3 సర్కిల్‌కు బదిలీ చేశారు. కాగా ఆమె స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

14 వరకు హౌసింగ్ సర్వే గడువు

అనంతపురం వైద్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అందరికీ ఇళ్లు, స్థలం నినాదనంతో చేపట్టిన హౌసింగ్ సర్వే గడువు తేదీని ఈ నెల 14వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి శైలజ తెలిపారు. నవంబరు 10నుంచి 30వరకు నిర్వహించిన సర్వేలో దాదాపు 50వేల కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. వివిధ కారాణాల వల్ల అనేక కుటుంబాలు సర్వేకు నోచుకోలేదన్నారు. దీంతో 14 వరకు జిల్లాలోని అర్హులందరితో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



పుట్టపర్తి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా (డీఎస్‌డీఓ) కిశోర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉదయభాస్కర్ చిత్తూరు జిల్లాకు బదిలీ ఆయ్యారు. ఆ స్థానంలో కిశోర్‌ను నియమించారు. దీంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాబయ్య ఉరుసుకు ఏర్పాట్లు పూర్తి

- నేడు సర్వమత సమ్మేళనం
- భారీ పోలీస్ బందోబస్తు


సిద్ధంగా వైద్య సిబ్బంది

పెనుకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పెనుకొండలో జరిగే బాబయ్యస్వామి గంధంపూజ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దర్గా పీఠాధిపతి సలావుద్దీన్‌బాబా తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గా ప్రాంగణం, మెయిన్‌గేటు, దివాన్‌ఖానా, సందల్ మహల్ వద్ద విద్యుత్ దీపాలతో అలంకరించామని వివరించారు. మంగళవారం రాత్రి 9గంటలకు జరిగే సర్వమత సమ్మేళనం, సభావేదికకు హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధి చెందిన బాబయ్యస్వామి దర్గా ఉరుసు ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు, ప్రముఖులు హాజరవుతుండటంతో డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ రాఘవన్ తెలిపారు. బందోబస్తులో భాగంగా 8మంది సీఐలు, 16 మంది ఎస్ఐలు, 44 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుల్‌లు, 150 మంది కానిస్టేబుళ్లు, 30 మంది మహిళా కానిస్టేబుళ్లు, వంద మంది హోమ్‌గార్డ్‌లు, ఎనిమిది రోప్‌వే పార్టీలు, ఏఆర్ సెక్షన్ 1, 16 చెక్‌పోస్ట్, ఔట్‌పోస్టులు, 8 పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


విద్యుత్ దీపాలంకరణలో దర్గా ప్రవేశ ద్వారం

క్రైం కార్నర్

ఎడ్లబండిని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

● కాడెద్దులు మృతి.. రైతుకు తీవ్రగాయాలు



మృతిచెందిన ఎద్దులు, నుజ్జయిన బండి

విడపనకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని 42వ జాతీయ రహదారిపై పెద్దకొట్టాలపల్లి వద్ద ఓ ప్రైవేటు బస్సు సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో ఎద్దుల బండిని ఢీకొట్టింది. ప్రమాదంలో కాడెద్దులు మృతి చెందగా.. రైతుకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పెద్దకొట్టాలపల్లికి చెందిన రైతు ఎర్రిస్వామి పప్పుశనగ పంట పొలంలో కడ్డీ గుంటక (కలుపు మొక్కలు తొలగించే గుంటక) పాసేందుకు ఉదయం 5 గంటలకు గ్రామంలో ఎద్దుల బండిని కట్టుకుని బయలుదేరి జాతీయ రహదారిపైకి వచ్చాడు. ఓ 5 నిమిషాలు ఉంటే పొలంలోకి వెళ్లేవాడు. అదే సమయంలో చెన్నై నుంచి బళ్లారికి వెళుతున్న పీఎస్ఆర్ ప్రైవేట్ ట్రావెల్ స్లీపర్ బస్సు ఎద్దుల బండిని వెనుక వైపు నుంచి ఢీ కొట్టడంతో బండి విరిగిపోయి నుజ్జు నుజ్జు అయ్యింది. ఎద్దులు ఎగిరిపోయి పొలంలో పడి అక్కడికక్కడే మృతి చెందాయి. రైతు ఎర్రిస్వామి బలమైన గాయాలతో బయట పడ్డాడు. ఎద్దుల బండిని ఢీకొట్టిన సమయంలో బస్సులో 30 మంది బళ్లారికి వెళ్లే ప్రయాణికులు ఉన్నారు. అందరూ ఒక్కసారిగా కేకలు వేస్తూ ఏమి జరిగిందోనని భయాందోళనకు గురయ్యారు. ముందువైపు డోరు తెరవటానికి రాలేదు. అతికష్టం మీద డోర్‌ను తీసి ప్రయాణికులను కిందికి దింపి మరో బస్సులో బళ్లారికి పంపారని పెద్దకొట్టాలపల్లి గ్రామస్థులు తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సును నడపటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతి చెందిన ఎద్దులకు అక్కడే పోస్టు మార్టం నిర్వహించారు. విడపనకల్లు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బస్సు పెద్ద ప్రమాదానికి గురయినా.. ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవటంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

గర్భందాల్చిన బాలిక

● నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన 14 ఏళ్ల బాలిక గర్భం దాల్చింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. దంపతులు.. తమకు దొరికిన పాపను పెంచుకున్నారు. 14 ఏళ్ల ఆ పాపపై ధర్మవరానికి చెందిన నరసింహులు కన్నేశాడు. బాలికను బెదిరించి, పలుమార్లు అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో బాలిక గర్భం దాల్చింది. కడుపు నొప్పిగా ఉందని బాలిక చెప్పడంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు.. బాలిక గర్భం దాల్చినట్లు చెప్పారు. బాలిక విషయం మొత్తం చెప్పింది. నరసింహులుపై బాలికను పెంచిన తల్లి.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు సమాచారం. నరసింహులుకు వివాహమై, ముగ్గురు పిల్లలున్నారు.

మూడు ఓవర్లు.. రూ.లక్షల్లో బెట్టింగులు

● ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు పందెం
● ధర్మవరం క్రీడామైదానంలో యథేచ్ఛగా క్రికెట్ బెట్టింగ్

ధర్మవరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ బెట్టింగ్ జోరుగా సాగుతోంది. మామూలుగా క్రికెట్ మ్యాచ్ అంటే 20 ఓవర్లు ఉంటాయి. ఇక్కడ మాత్రం మూడు ఓవర్లు మాత్రమే ఉంటాయి. కొత్త విధానానికి ధర్మవరం క్రీడామైదానాన్ని వేదికగా మార్చారు కొందరు ప్రబుద్ధులు. ఈ క్రీడామైదానం డీఎస్పీ కార్యాలయానికి, వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు అతి దగ్గర్లో ఉన్నాయి. ఈ క్రీడామైదానంలో బెట్టింగ్ క్రికెట్ చూసేందుకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళ్తున్నారు. ఈ క్రికెట్‌లో బండ రాయి వికెట్లు, రబ్బరు బాల్‌తో క్రికెట్ ఆడుతున్నారు. ఇందులో ప్రతిబాల్‌ను ఉతకడమే మ్యాచ్ ప్రత్యేకత. ఒక్కో టీంకు ఐదుగురు చొప్పున రెండు టీంలకు మొత్తం 10 మంది క్రీడాకారులు ఉంటారు. మ్యాచ్ మొత్తం మూడు ఓవర్లే. ఏ టీం మూడు ఓవర్లలో ఎక్కువ స్కోరు చేస్తుందో ఆ టీం గెలిచినట్టే. ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్షలు పందెం. మూడు ఓవర్లలో ఒక టీం 50 పరుగులు చేస్తే మరో టీం 51 పరుగులు చేసిందంటే ఆ టీం గెలిచినట్టే. ఈ బెట్టింగ్ క్రికెట్‌లో ఒక్కో మ్యాచ్‌కు రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు ఆడుతున్నారు. కేవలం గంటలోపే మ్యాచ్ మొత్తం ముగుస్తుంది. వారానికి మూడు లేదా నాలుగు రోజులు మాత్రమే బెట్టింగ్ క్రికెట్ ఆడుతూ లక్షల్లో బెట్టింగ్ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రీడామైదానానికి డీఎస్పీ కార్యాలయం, వన్‌టౌన్ పోలీసు స్టేషన్ దగ్గరలో ఉన్నా, ఇంత పెద్ద ఎత్తున బెట్టింగ్ క్రికెట్ ఆడుతున్నా, రోజు లక్షల్లో చేతులు మారుతున్నా ఇదేమి పట్టనట్టు పోలీసులు వ్యవహరిస్తున్నారు. కొంతమంది పోలీసులు ఈ క్రికెట్ మ్యాచ్ ఆడే క్రీడాకారులతో సొమ్ము చేసుకుంటున్నట్టు సమాచారం.

హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేశారు. సోమవారం స్థానిక ఎల్ఆర్‌జీ స్కూల్‌లో హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రియాజ్ అహ్మద్, సాకే శివశంకర్ తెలిపారు. ఎంపికైన జట్టులో.. భరత్, కృష్ణ, సాయికిరణ్, రాజు, వినోద్‌నాయక్, వినయ్‌కుమార్, ప్రసాద్‌నాయక్, హరినాథ్, దుశ్యంత్, హర్ష, సిద్దిక్, రవి, ధనుష్, నాగలితీష్, పవన్‌కుమార్, ప్రణీత్ ఉన్నారు. ఈ జట్టు ఈనెల 4వతేదీ నుంచి కర్నూలులో నిర్వహించే 11వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి రవి, సీనియర్ క్రీడాకారులు ఆది, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా బ్యాటర్లు అదరహో..!

● శతకంతో రాణించిన ఓపెనర్ వీరారెడ్డి
● సెంచరీ చేజార్చుకున్న శ్రీనివాస్



వీరారెడ్డి



శ్రీనివాస్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కర్ణాటకతో మ్యాచ్‌లో ఆంధ్రా బ్యాటర్ల అదరహో అనిపించారు. బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీ అండర్-19లో భాగంగా స్థానిక అనంత క్రీడా గ్రామంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో సోమవారం ఆంధ్రా, కర్ణాటక జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభించారు. టాస్ గెలిచి బ్యాటింగ్‌కి దిగిన ఆంధ్రా జట్టు 91 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 300 పరుగులు చేసింది. ఓపెనర్ కేహెచ్ వీరారెడ్డి 163 బంతుల్లో 5 సిక్సర్లు, 10 బౌండరీలతో శతకం (114) బాదాడు. మరో బ్యాటర్ కేఎల్ శ్రీనివాస్ 225 బంతుల్లో 2 సిక్సర్లు, 11 బౌండరీలతో సెంచరీ (98 పరుగులు) చేజార్చుకున్నాడు. ఏఎన్‌వీ లోహిత్ 41, పరమ్‌వీర్ 24 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు.

కమనీయం.. ధ్వజారోహణం





అలంకరణలో నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



నరసింహ స్వామి ఆలయంలో ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

మడకశిర రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన భక్తరహళ్ళి నరసింహస్వామి, జిల్లేడగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ధ్వజారోహణం కమనీయంగా సాగింది. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. హోమాలు చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి.. స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. వారిని ఈఓ నరసింహరాజు శాలువాతో సన్మానించారు.

అన్ని చెరువులు నింపాలి

● రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ● హంద్రీనీవా కాలువ పరిశీలన



మాట్లాడుతున్న బొజ్జా దశరథ రామిరెడ్డి

సోమందేపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పాలకులు ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా కాలువ కింద అన్ని చెరువులు నింపాలని రాయలసీమ సాగునీటి సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథ రామిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్ర సమీపాన హంద్రీనీవా కాలువను సమితి సభ్యులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. బొజ్జ దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ.. హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లోని 260చెరువులను నీటితో నింపుతామనీ, ప్రతి ఎకరాకు నీరు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు వాగ్దానం చేశారన్నారు. ఇంతవరకు మూడు చెరువులు మాత్రమే నింపారన్నారు. కాలువలో వెయ్యిక్యూసెక్కులు ప్రవహించాల్సి ఉండగా.. రెండు పంపులతో 214క్యూసెక్కులు మాత్రమే పంపింగ్ చేస్తున్నారన్నారు. మిగతా ఆరు పంపులు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు 5 టీఎంసీల నీరు విడుదల చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 0.85 టీఎంసీలు మాత్రమే ఇచ్చారన్నారు. ఏటా రైతులకు నీటి భరోసా ఇవ్వడమే తప్ప.. సమృద్ధిగా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. దీంతో ఆయకట్టు రైతులు పంటలను సాగుచేయడం లేదన్నారు. నిర్వహణ సరిగా లేక కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి హంద్రీనీవా కాలువ అధ్వానంగా ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు కాలువలు, చెరువుల పరిస్థితిని పరిశీలించి స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అనంతరం హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీర్ వీరబాబుతో పలు సమస్యలపై నాయకులు చర్చించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, ఖాసీం, చైతన్య గంగిరెడ్డి, జలసాధన సమితి ఉమ్మడి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సంఘం
రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలగంగాధర్



అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీకే బాలగంగాధర్‌ను ఎన్నుకున్నారు. విజయవాడలో ఆదివారం జరిగిన ఏపీ సహకార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గం ఎన్నికల్లో జిల్లాకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ జీకే బాలగంగాధర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ సోమర జయచంద్రనాయుడు, సహకార ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లరాయుడు, కుమార్ తదితరులు బాలగంగాధర్‌కు అభినందనలు తెలిపారు.

శిక్షణకు వెళ్లిన జడ్పీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ) ఇండక్షన్ శిక్షణకు విజయవాడకు వెళ్లారు. నూతనంగా డీడీఓలుగా పదోన్నతి పొందిన వారికి శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే మొదటి విడతలో డీడీఓ నాగశివలీల అక్టోబరు 5 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. రెండో విడతలో భాగంగా డీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారిలో డిప్యూటీ సీఈఓ, ఏపీడీలుగా ఉన్న వారికి మొదటి దశ శిక్షణలో భాగంగా ఈనెల 5వ తేది నుంచి 19వ తేది వరకు 15 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. దీంతో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య శిక్షణను పూర్తి చేసుకొని వచ్చారు. మూడో విడతలో భాగంగా డిసెంబరు 1వ తేది నుండి 13వ తేదీ వరకు ఇచ్చే శిక్షణలో పాల్గొనడానికి సీఈఓ శివశంకర్ వెళ్లారు.

టమోటా కిలో రూ.37

అనంతపురం రూరల్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.37తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.20తో, సరసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1050 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు.

మహిళలు, బాలికలపై హింసను ఆపాలి

● కలెక్టర్ ఆనంద్.. పోస్టర్లు విడుదల

అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై జరిగే హింసను ఆపడానికి సమాజంలోని అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేయాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ పక్షోత్సవాల నేపథ్యంలో కలెక్టర్, ఇతర అధికారులు పోస్టర్లను విడుదల చేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సెల్ఫీ బూత్, సైన్ బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం జేసీ శివ్‌నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్ఓ మలోల, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి తదితరులతో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ, పలువురు అధికారులు సంఘీభావంగా సెల్ఫీలు దిగి, సిగ్నేచర్ క్యాంపెయిన్ బోర్డుపై సంతకాలు చేశారు.

డిప్యూటీ ఎంపీడీఓలకు పోస్టింగులు

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి జిల్లాల్లో కేటాయింపులు చేస్తూ కమిషనర్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా సత్యసాయి జిల్లాకు కేటాయించిన వారిలో సోమవారం 31 మందికి మండలాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీకే పల్లి, కనగానపల్లి మండలాకు కేటాయించిన డిప్యూటీ ఎంపీడీఓలు సోమవారం రిలీవ్ అయ్యి అక్కడ డిప్యూటీ ఎంపీడీఓలుగా బాధ్యతలు చేపట్టారు. మరో రెండు రోజుల్లో మిగిలిన వారు కూడా రిలీవ్ అయ్యి వారికి కేటాయించిన మండలాల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతపురం జిల్లాకు కేటాయించిన వారికి సంబంధించి ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు.

చీనీ టన్ను రూ.21వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.21వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.15వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు 44టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

మేనమామే హంతకుడు

● పథకం ప్రకారమే బాలుడి హత్య
● నిందితుడి అరెస్ట్: డీఎస్పీ

కదిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలంలో సంచలనం సృష్టించిన కొమ్మెర హర్షవర్ధన్ అనే బాలుడి హత్య కేసులో మేనమామను పోలీసులు అరెస్ట్ చేశారు. పథకం ప్రకారమే హత్య చేసినట్లు నిందితుడు ప్రసాద్ దర్యాప్తులో ఒప్పుకున్నట్లు కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. సోమవారం కదిరి రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. గత నెల 26న ఉదయం 11 గంటలకు తలుపుల మండల పరిధిలోని గరికపల్లికి చెందిన ఐదు సంవత్సరాల హర్షవర్ధన్ కనిపించాకుండా పోయాడు. సాయంత్రం వరకు వెదికిన తల్లిదండ్రులు.. అదేరోజు తలుపుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 27వతేదీ తెల్లవారుజామున 3గంటలకు ఎన్పీకుంట మండలంలోని మర్రికొమ్మెదిన్నె, జౌకల మధ్యలోని అటవీప్రాంతంలో బాలుడి శవాన్ని కనుగొన్నారు. బాలుడిని హత్యపై దర్యాప్తు మొదలు పెట్టారు. మొదటగా బాలుడి మేనమామ ప్రసాద్‌పై పోలీసులకు అనుమానం వచ్చింది. 26వ తేదీ ఉదయం నుంచి బాలుడు మేనమామ వద్దే ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. చివరకు బాలుడి మేనమామే హంతకుడిగా నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని సోమవారం మధ్యాహ్నం కదిరి మున్సిపాలిటీ పరిధిలోని మూర్తిపల్లి సబ్ స్టేషన్ వద్ద అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు వివరించారు. సమావేశంలో రూరల్ సీఐ నాగేంద్ర, తలుపుల ఎస్ఐ నరసింహుడు ఉన్నారు.

పథకం ప్రకారమే హత్య..

బాలుడు హర్షవర్ధన్‌ను అతడి మేనమామ ప్రసాద్ పథకం ప్రకారమే హత్య చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితుడి కుమారుడు బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఈ విషయంపై ప్రసాద్ బావ గంగాధర్ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెట్టాడన్న కక్ష పెంచుకున్నాడు. తన కుమారుడు లేకుండాపోతే ఎంత బాధ ఉంటుందో.. తన బావమరిది కూడా అంత బాధను చూపించాలని మనసులో పెట్టుకున్నాడు. రెండుమూడునెలలుగా హర్షవర్ధన్‌ను మేనమామ బాగా మచ్చిక చేసుకున్నాడు. ఆ అనుబంధంతోనే బాలుడిని నమ్మించి, గతనెల 26న ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని ఎన్పీకుంట మండలం మర్రికొమ్మెదిన్నె, జౌకల మధ్యలో ఉన్న అడవిలోకి తీసుకెళ్లి ఓ చెట్టుకింద గొంతు నులిమి హత్యచేసినట్లు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తులో సంఘటనా స్థలం వద్ద నిందితుడి పర్సు, ఆధార్‌కార్డు, బాలుడి చెప్పులు, నిందితుడి చెప్పులు లభ్యమైనట్లు చెప్పారు. నిందితుడిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పిల్లలపట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని డీఎస్పీ సూచించారు. కేసును ఛేదించిన సీఐ, ఎస్ఐ, పోలీసులను డీఎస్పీ అభినందించారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పోలీస్ అధికారులు

సీనియర్ జర్నలిస్టు
కాలవ రమణ కన్నుమూత

● నివాళులు అర్పించిన జర్నలిస్టులు, ప్రముఖులు



అనంతపురం ప్రెస్‌క్లబ్/రూరల్/కళ్యాణదుర్గం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రముఖ పాత్రికేయుడు కాలవ వెంకట రమణ అనారోగ్యంతో సోమవారం కన్నుమూశారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందినా, కోలుకోలేకపోయారు. ఆరోగ్యం మరింత క్షీణించడంతో సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కాలవ రమణ పలు పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. విషయం తెలియగానే పలువురు జర్నలిస్టులు, మిత్రులు ఆస్పత్రి వద్దకు వెళ్లి పుష్పాంజలి ఘటించారు. ఆయన మృతదేహాన్ని హిందూపురానికి తరలించి, అంత్యక్రియలను నిర్వహించారు. ఆయనకు భార్య, ఇంటర్ చదువుతున్న కూతురు ఉన్నారు.

ప్రముఖుల సంతాపం

● సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ అకాల మరణంపై కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా సమస్యలపై స్పందిస్తూ, అనేక కథనాలను రాసిన ఆయన.. సమాజసేవకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని అన్నారు. ఆయన కుటుంబానికి తనవంతుగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తానని ప్రకటించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు.

● సీనియర్ జర్నలిస్టు కాలవ రమణ కుటుంబానికి అండగా ఉంటామని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి అన్నారు. ఆయన మృతిపట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. జిల్లా సమస్యలపై ప్రజల తరపున స్పందిస్తూ సమాజ సేవకు ఆయన ఎంతో కృషిచేశారని అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులతో మంచి సంబంధాలు కొనసాగించారని కొనియాడారు. మంచి మిత్రుడిగా, అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించే వ్యక్తి దూరం కావడం చాలా బాధాకరమని అన్నారు.

కేంద్రీయ విద్యాలయాల్లో ఉద్యోగాలు

గోరంట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో దేశవ్యాప్తంగా 9,126, నవోదయ విద్యాలయ సమితిలో 5,841 మొత్తం 14,967 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గోరంట్ల మండలం పాలసముద్రం కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ క్రిష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో బోధన, బోధనేతర, ఉద్యోగాల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అసిస్టెంట్ కమిషనర్లు, ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, పీజీటీ, టీజీటీలు, పీఆర్‌టీలు, స్పెషల్ ఎడ్యుకేటర్లు, లైబ్రేరియన్లు, వివిధరకాల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎంపికైన అభ్యర్థులను భారతదేశంలో ఎక్కడైనా నియమించవచ్చన్నారు. బీఈడీ, ఎంఈడీ లాంటి సూచించిన విద్యార్హతలను అభ్యర్థులు కలిగి ఉండాలని తెలిపారు. భారత ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు ఉంటాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు అధికారిక నోటిఫికేషన్ పరిశీలించాలన్నారు.

జేఎన్‌టీయూ వీసీకి జాతీయ అవార్డు



వీసీకి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెబుతున్న రిజిస్ట్రార్, డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ వీసీ ఆచార్య సుదర్శనరావుకు జాతీయ అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. కృష్ణయ్య ఆధ్వర్యంలో డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, సిబ్బంది వీసీని ఆయన ఛాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. 2025వ సంవత్సరానికిగానూ ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్‌గా ప్రతిష్ఠాత్మకమైన 55వ ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ) జాతీయ అవార్డు గత నెల 29వ తేదీన ప్రదానం చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. వీసీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో వీసీ ఓఎస్‌డీ ఆచార్య ఎన్. దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

శిశుగృహలో ఏడుగురి తొలగింపు

అనంతపురం వైద్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని శిశుగృహలో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఏడుగురు సిబ్బందిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్ ఆదేశాలతో ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. మేనేజర్ దీప్తి, సోషల్ వర్కర్ లక్ష్మీదేవి, ఏఎన్ఎం గుణవతి, ఆయాలు ప్రభావతి, ఆదిలక్ష్మి, నూర్జహాన్, వాచ్‌మన్ రాజశేఖర్‌ను తొలగించినట్లు పీడీ అరుణకుమారి తెలిపారు. శిశువుల సంరక్షణకు ఇబ్బందులు తలెత్తకుండా ఏఎన్ఎంలను ఏర్పాటు చేశామన్నారు.

నిర్లక్ష్య ఫలితం: శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న చిన్నారి నిరూప్ అక్టోబరు 2న మృతిచెందిన విషయం తెలిసిందే. చిన్నారి మృతి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా నిబంధనలు విస్మరించి నిరూప్ మృతదేహాన్ని శిశుగృహ సిబ్బంది ఖననం చేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించి శిశుమరణంపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని ఆదేశించారు. మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక విచారణ కమిటీలను ఏర్పాటు చేశారు. నిరూప్ మృతిని జిల్లా కోర్టు సుమోటోగా తీసుకుంది. తక్షణ చర్యలకింద పీడీ నాగమణిని సస్పెండ్ చేశారు. అనంతరం చేపట్టిన విచారణలో శిశుగృహ సిబ్బంది నిర్లక్ష్యంతోనే నిరూప్ మృతిచెందినట్లు కమిటీలు నిర్ధారించాయి. ఆ మేరకు న్యాయపరమైన చిక్కులు లేకుండా శిశువు మృతికి కారకులపై చర్యలు తీసుకునేందుకు రెండు నెలలపాటు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేసింది. ఎట్టకేలకు ఏడుగురిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించింది.

ప్రజాసంక్షేమమే కూటమి ధ్యేయం

● రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ● దామాజిపల్లిలో పింఛన్ల పంపిణీ


దామాజిపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మండలంలోని దామాజిపల్లిలో సోమవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పలువురి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఒకటో తేదీ వచ్చిందంటే లబ్ధిదారుల ఇంటి వద్ద పండగ వాతావరణం కనిపిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ప్రతినెలా నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారంటే ఆయన చిత్తశుద్ధి ఏమనేది అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అహర్నిశలు కష్టపడుతున్నారని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక సమస్యలో ఉన్నా.. ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారని తెలిపారు. గ్రామంలో కొన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని, త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. ఇంటిపట్టాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టడం జరుగుతుందని అందుకోసం స్థల సేకరణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. తర్వాత గ్రామంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త ఆదెప్ప కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలకృష్ణుడు, తహసీల్దార్ సురేశ్‌కుమార్, టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, సొసైటీ అధ్యక్షుడు నరసింహులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్ లక్ష్మీనరసమ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. వెయ్యి పెంచేందుకు జగన్‌కు ఐదేళ్లు పట్టింది

● పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే దగ్గుపాటి విమర్శ



మరాఠీ కాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మారుతి నగర్‌లో మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్ నాయుడు

అనంతపురం క్రైం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ సొమ్ము రూ.వెయ్యి పెంచేందుకు జగన్‌కు ఐదేళ్ల పట్టిందని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ విమర్శించారు. రాజీవ్ కాలనీ పంచాయతీలోని మరాఠీకాలనీ, 16వ డివిజన్‌లోని బాబా నగర్, 38వ డివిజన్‌లోని కోవూరు నగర్‌లో సోమవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రానికి ఎలాంటి పెట్టుబడులు రాలేదని, ఆఖరికి విశాఖపట్నంలో ప్రభుత్వ ఆఫీసులను తాకట్టు పెట్టారని, ఆయన మరోసారి సీఎం అయి ఉంటే రాష్ట్రాన్ని పూర్తిగా తాకట్టు పెట్టేవారని ఈ సందర్భంగా దుయ్యబట్టారు.

ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తాం

అనంతపురం క్లాక్‌టవర్: ఏడాదిలో నగర రూపురేఖలు మార్చేస్తామని, అందుకు ప్రణాళికను అమలు చేయబోతున్నామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. 38వ డివిజన్‌లోని విద్యారణ్య పాఠశాల వద్ద రూ.39లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భూమి పూజ చేశారు. అలాగే 27వ డివిజన్‌లో రూ.70లక్షలతో పూర్తి చేసిన అశోక్‌నగర్ మెయిన్ రోడ్డును శిలాఫలకం ఆవిష్కరించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదన్నారు. కూటమి వచ్చాక నగరంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు. గుంతల రోడ్లను బాగు చే స్తూ.. మురుగు కాలవల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఏడాదిలోపు నగర రూపురేఖలు మార్చే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈ షాకీర్, ఎంపీడీఓ దివాకర్, మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్‌నాయుడు, వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ స్వప్న, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బల్లాపల్లవి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, భావన, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, రాయల్‌మురళి, సుధాకర్‌నాయుడు, నెట్టెం బాలకృష్ణ, బీజేపీ నాయకుడు లలిత్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, ఉపాధ్యక్షుడు రమేష్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు భవానీ రవికుమార్, పీఎల్ఎన్ మూర్తి, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వర్, శివ, పవన్‌తోపాటు నాయకులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

నగరపాలక సంస్థలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను వయోపరిమితి సాకుతో తొలగించడం దారుణమని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు అజయ్‌బాబు డిమాండ్ చేశారు. ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎమ్మెల్యేని కలిసి వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపాలు, ఉపాధ్యక్షులు సురేష్‌బాబు, వెంకటప్ప, చిరంజీవి, ఓబుళేసు, రాఘవ, గంగాధర్, అంజి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పాయ్ విగ్రహ ఏర్పాటుకు స్థానిక గుత్తిరోడ్డులో సోమవారం బీజేపీ నాయకులు భూమిపూజ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర మీడియా అధికారప్రతినిధి వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రత్నమయ్య, రామచంద్రయ్య తదితరులు ఇందులో పాల్గొన్నారు.

నగర పాలక సంస్థలో పీజీఆర్ఎస్


వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఏఎంసీ కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) జరిగింది. ఇందులో పలువురు ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ కమిషనర్ బాలస్వామికి వినతిపత్రాలు ఇచ్చారు. ముఖ్యంగా నగరంలో చేపట్టే రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణ పనుల్లో నాణ్యత లేదని, కమలానగర్, గుల్జార్‌పేట, పాతూరు, హౌసింగ్‌బోర్డు ప్రాంతాలలో మురుగు నీటి సమస్య అధికంగా ఉందని, ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా అమలు కావడం లేదని, కుక్కల బెడద అధికమైందని, ఆయా సమస్యల్ని పరిష్కరించాలని వినతులు అందాయి. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి పని నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నాసిరకంగా పనులు చేస్తే బ్లాక్‌లిస్టులో పెడతామని హెచ్చరించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపడాలని, ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. త్వరలో కుక్కల సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ పావని, ఎస్ఈ రాజశేఖర్, ఏసీపీ నీరజాక్షి, టీపీఆర్ఓ నాగ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

● ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

అనంత పురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో పేరుకుపోయిన మూఢనమ్మకాలు, ఛాందస వాదాలను నిర్మూలించకపోతే భావితరాలకు భవిష్యత్తు ఉండదని, సమాజాన్ని హెచ్చరించిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో గురజాడ అప్పారావు వర్ధంతిని నిర్వహించారు. ఆచార్య రాచపాలెం ముఖ్యఅతిథిగా హాజరై గురజాడ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. గురజాడ లాంటి మహానుభావులు దేశంలో పేరుకుపోయిన మూఢనమ్మకాల నిర్మూలనకు కృషి చేయకపోతే నేడు పరిస్థితులు ఇలా ఉండేవి కాదన్నారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ... మతాలన్నీ మాసిపోయి జ్ఞానమొక్కటే నిలిచి వెలుగుతుందని చెప్పి మనుషుల మధ్య సమానత్వాన్ని గురజాడ చాటారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, అధ్యాపకులు, జేవీవీ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

108 రాకపోవడంతో..

●ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో బాధితుడు


నిస్సహాయ స్థితిలో హరిరాజు, భార్య కళావతి

అనంత పురం వైద్యం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాల నుంచి కర్నూలు ప్రభుత్వాస్పత్రికి వెళ్లేందుకు 108 వాహనం రాకపోవడంతో ఓ బాధితుడు ప్రాణాప్రాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. జిల్లా సరిహద్దు దాటి వెళ్లలేమని 108 నిర్వాహకులు చెప్పడంతో బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమౌతున్నారు. బాధితుడి భార్య తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు పట్టణానికి చెందిన హరిరాజు సెంట్రింగ్ పనులు, ఆయన భార్య కళావతి బట్టల షాపులో రోజువారి కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా గత శుక్రవారం హరిరాజు తల నొప్పితో బాధపడుతూ వాంతులు చేసుకున్నాడు. భార్య వెంటనే గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన డాక్టర్లు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. 108లో అతడిని అనంతపురం ఆస్పత్రికి తీసుకువచ్చి ఎంఎస్ఐలో అడ్మిట్ చేశారు. ఇక్కడి వైద్యులు పరీక్షించి అతడికి బీపీ ఎక్కువ కావడంతో మెదడులోని రక్తనాళాలు చిట్లి బ్లీడింగ్ అవుతోందని గుర్తించారు. ఇందుకు సంబంధించిన ఆపరేషన్‌ను కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేస్తారని, వెంటనే తీసుకెళ్లాలని అతడి భార్యకు సూచించారు. ఆలస్యమైతే ప్రాణాలకే ప్రమాదమని హెచ్చరించారు. దీంతో ప్రైవేట్ అంబులెన్స్‌ను సంప్రదించడంతో వేలరూపాయలు బాడుగ అడగారు. చేతిలో చిల్లిగవ్వలేని హరిరాజు భార్య 108కు ఫోన్ చేసి పరిస్థితిని వివరించింది. ఇతర జిల్లాలకు 108వాహనాన్ని పంపలేమని నిర్వాహకులు తేల్చిచెప్పారు. అర్ధరాత్రివరకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో చేసేదిలేక హరిరాజు అనంతపురం ఆస్పత్రిలో ఉండిపోయాడు. ఏక్షణాన ఏమిజరుగుతుందోనని అతడి భార్య కన్నీటి పర్యంతమౌతోంది.

హెచ్‌ఐవీపై అవగాహన పెంపొందాలి: డీఎంహెచ్‌ఓ


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీపై ప్రజల్లో అవగాహన పెంపొందాలని, 18 ఏళ్ల వయసు పైబడిన వారందరూ హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా నగరంలో సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిని డీఎంహెచ్‌ఓతోపాటు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్, ఎయిడ్స్ నియంత్రణ విభాగాధికారి డాక్టర్ జయలక్ష్మి, ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో హెచ్‌ఐవీ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారన్నారు. రక్తమార్పిడి, సురక్షితం కాని లైంగిక సంపర్కంతో హెచ్‌ఐవీ సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందన్నారు. కలిసి భోజనం చేయడం, ఒకరి దుస్తులు మరొకరు వాడటం, మరుగుదొడ్లను వినియోగించడం ద్వారా హెచ్‌ఐవీ సోకదన్నారు. రోగాన్ని నయం చేయడం కంటే అది రాకుండా చూసుకోవడం ఉత్తమమని సూచించారు. హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్ష చూపడం, వారిని దూరం పెట్టడం చట్టవిరుద్ధమని తెలిపారు. కార్యక్రమంలో డెమో నాగరాజు, హెచ్ఈఈఓ త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఈఈ గంగాధర్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం


ప్రాణాపాయ స్థితిలో ఉన్న యమున

అనంతపురంక్రైం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళ లేక భార్య ఆత్మహత్యకు యత్నించింది. ఈ ఘటనపై స్థానికులు, ఇటుకలపల్లి పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతపురం రూరల్ మండలం చిన్నకుంట గ్రామానికి చెందిన వీరనారాయణ ధర్మవరంలోని అగ్నిమాపకకేంద్రంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు రాప్తాడుకు చెందిన యమునతో 2014లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. వీరి కాపురం కొద్దికాలం సవ్యంగానే సాగింది. అనంతరం మనస్పర్థలు వచ్చాయి. ముఖ్యంగా వీరనారాయణ అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తూ వచ్చాడు. వీటిని తాళ లేక 2019లో మొదటిసారి ఆమె ఆత్మహత్యకు యత్నించి ప్రాణాపాయం నుంచి బయటపడింది. వేధింపులు ఆగకపోవడంతో మనస్థాపం చెందిన ఆమె సోమవారం మరోసారి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో....మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. యమున పుట్టింటి వారు మాట్లాడుతూ... అదనపు కట్నం కోసమే భర్త తరచూ వేధిస్తున్నాడన్నారు. తమ కుమార్తెకు బలవంతంగా భర్త, ఆమె కుటుంబీకులే పురుగుల మందు తాగించారంటూ ఆరోపించారు. పోలీసులు గతంలో కౌన్సెలింగ్ ఇచ్చినా వీరనారాయణలో మార్పు కనిపించలేదన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

అనంతపురం క్రైం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు. షికారి శీనా అలియాస్ పంది శీనా, షేక్ మహమ్మద్ ఖాన్ అలియాస్ షేర్ ఖాన్ నగరంలోని నవోదయ కాలనీలో హిందూ స్మశాన వాటిక వద్ద గంజాయి విక్రయించేందుకు యత్నిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారన్నారు. అనంతరం వారి నుంచి 1.2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకొచ్చి... ఇక్కడ ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు విచారణలో తేలిందన్నారు. ముఖ్యంగా .యువతకు, విద్యార్థులకు విక్రయిస్తున్నారన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా.. కొన్నా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయండి


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ శ్రేణులు

అనంతపురం విద్య, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈనెల 10వ తేదీన నిర్వహిస్తున్న సీపీఐ శతాబ్ధి ఉత్సవాలను జయప్రదం చేయాలని నగరసీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాతూరులో సోమవారం వారు ర్యాలీ నిర్వహించారు. నాయకులు శ్రీరాములు, రమణయ్య మాట్లాడుతూ శతాబ్ది ఉత్సవాలను నగరంలోని లలితకలాపరిషత్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఐ కోసం దశబ్దాలుగా పనిచేస్తున్న కుటుంబాలను ఆరోజు సత్కరించడం జరుగుతుందన్నారు. జాతీయ,రాష్ట్రనాయకులు ఈవేడుకలకు హాజరవుతున్నారన్నారు. సీపీఐ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు అల్లీపీరా, ఎల్లుట్లనారాయణస్వామి, వరలక్ష్మి, రామాంజనేయులు, ఈడిగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

అనంతపురం వైద్యం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు ఉద్యోగోన్నతి కల్పించాలని ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం వారు నగరంలో కడప రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు చంద్రమోహన్, వెంకటరెడ్డి, సుబ్బయ్య, జమీలబేగం తదితరులు పాల్గొన్నారు.

మెడికల్‌షాపులను తనిఖీ చేయండి

అనంతపురం విద్య, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చాలా మెడికల్ షాపులలో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరుగుతున్నాయని, తనిఖీలు చేపట్టాలని ఏఐవైఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు కలెక్టరేట్‌లోని ప్రజాఫిర్యాదుల వేదికలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, నాయకులు శ్రీనివాస్,సురేంద్ర,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గంధం ఉత్సవాలకు ఆహ్వానం

అనంతపురం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెనుగొండలో త్వరలో నిర్వహించనున్న హజరత్ సయ్యద్ బాబా ఫక్రుద్దీన్ దర్గా గంధం ఉరుసు ఉత్సవాలకు రాష్ట్ర ముతవల్లిల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫికి ఆహ్వానమందింది. సోమవారం దర్గా పీఠాధిపతి తాజ్ బాబా సాహెబ్ అనంతపురం నగరానికి విచ్చేసి కేఎం షకీల్ షఫిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి ఉరుసు ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. అలాగే షకీల్ షఫి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎంపిక

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆశాఖ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడిగా పెద్దకోట్ల సురేశ్, ప్రధాన కార్యదర్శిగా అమర్నాథ్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చంద్రశేఖర్, జిల్లా కౌన్సిలర్‌గా అమర్‌నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడిగా గోపాల్‌రావును ఎంపిక చేసినట్లు ప్రకటించారు. మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

జూడోలో నలంద కాలేజీ విద్యార్థి సత్తా


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

అనంత పురం విద్య, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీలలో నగరానికి చెందిన నలంద జూనియర్ కాలేజి విద్యార్థి అర్జున్‌సత్తా చాటాడు. గత నవంబరు 29,30వ తేదీల్లో శ్రీసత్యసాయి జిల్లా చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్14-19 విద్యార్థులకు రాష్ట్రస్థాయి జూడోపోటీలు జరిగాయి. ఇందులో అర్జున్ పాల్గొని అత్యంత ప్రతిభ చాటి ప్రథమస్థానంలో నిలిచాడు. ఇందుకు అతడ్ని సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఖాజీబాబు, లెక్చరర్లు అభినందించారు.

డిప్యూటీ ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ధర్మవరం ఎంపీడీఓ కార్యాలయంలో పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఊరూ వాడా.. పింఛన్ పండగ

● ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేత

న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల నియోజకవర్గాల్లో సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తోందని తెలిపారు. పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.


గార్లదిన్నె మండలం కొప్పలకొండలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి


అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్ చౌదరి తదితరులు


కనగానపల్లి మండలం బద్దలాపురంలో డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్


బీకేఎస్‌లో టీడీపీ నేతలు రామలింగారెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు

దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

అనంతపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ భవన్‌లో సోమవారం ఆయన విజువల్లి ఛాలెంజ్‌డ్ ఎంప్లాయిస్ అసోషియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కుల చట్టం తెలుగు అనువాద పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... ఈ పుస్తకం దివ్యాంగులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, ఆనంద్, తిప్పేనాయక్, దివ్యాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ అనిల్, విజువల్లి ఛాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి జలంధర్‌రెడ్డి, ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రతాప్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోయ ఆనంద్ మృతిపై సమగ్ర విచారణ చేయాలి

అనంతపురం అర్బన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): బ్రహ్మసముద్రం మండలం యానకల్లుకు చెందిన బోయ ఆనంద్ ఈనెల 20వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని, ఆయన మృతిపై సమగ్ర విచారణ చేయాలని ఏపీ వాల్మీకి బోయ సంఘం, ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు నగరంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో బోయ ఆనంద్ కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీ జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవ, జిల్లా అధ్యక్షుడు మాధవయ్య, వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్, గౌరవసలహాదారుడు జీవీ రమణ, జిల్లా అధ్యక్షుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని కాలేజీలపై చర్యలు తీసుకోండి

అనంతపురం విద్య, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఆర్ఐఓ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప మాట్లాడుతూ.. నగరంలో కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయన్నారు. కొన్ని యాజమాన్యాలు ఒక కళాశాలకు అనుమతి తీసుకుని మరోప్రాంతంలో ఇంకో కాలేజీ నడుపుతున్నారన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సైతం ఇప్పుడే అడ్మిషన్లు చేపడుతున్నారని, ఈ మేరకు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా.. ఆర్ఐఓ పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేని కాలేజీలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ, మంజునాథ్, ఉమామహేష్, సాయివిజయ్, రాకేష్, కార్తీక్, యశ్వంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

శింగనమల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ గోరంట్ల మారుతీనాయుడు సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిసోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ప్రజలు ఏవేని సమస్యలుంటే అధికారులకు వినతిపత్రాల ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు గుర్రం లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకులు మాసూల చంద్రమోహన్, పెరవలి కాటమయ్య, వరదరాజులు పాల్గొన్నారు.

పంటల బీమాకు ప్రీమియం చెల్లించాలి

రాప్తాడు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): రబీసీజన్‌కు సంబంధించి పంటల బీమాకు రైతులు ప్రీమియం చెల్లించుకోవాలని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కిష్టప్ప సూచించారు. రాప్తాడు రైతుసేవా కేంద్రం పరిధిలోని గంగులకుంట, ప్రసన్నాయపల్లి గ్రామాల్లో సోమవారం పంటల బీమా వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కిష్టప్ప మాట్లాడుతూ... పంటలవారీగా రైతులు ప్రీమియం చెల్లించాలన్నారు. వరికి ఎకరాకు రూ. 630, జొన్నకు రూ. 315, మొక్కజొన్నకు 525, శనగకు 450, వేరుశనగకు 480, మామిడికి రూ. 1650, టమోటాకు రూ. 1600 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. ఏఓ కృష్ణచైతన్య, ఏఈఓ, ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

అనంతపురం టౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మార్గశిర ఏకాదశిని పురస్కరించుకుని మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సోమవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆలయ ఆవరణలోని వేదికపై శారదామాత ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు అమిలినేని నరేంద్ర చౌదరి, ఈఓ నాగేంద్రుడు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

చేనేతల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న చేనేత సెల్ కన్వీనర్

తాడిపత్రి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చేనేతల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేసినట్లు జిల్లా చేనేత సెల్ కన్వీనర్ పరిశే నారాయణస్వామి తెలిపారు. అనంతపురంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశామన్నారు.

నేడు బీటీపీ ఆయకట్టు రైతుల సమావేశం

గుమ్మఘట్ట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భైరవానితిప్ప ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల పరిధిలోని ఆయకట్టు రైతులతో మంగళవారం 10 గంటలకు స్థానిక బీటీపీ అతిథిగృహం వద్ద సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీటీప్రాజెక్ట్ ఛైర్మన్ కాలవ నాగరాజు, కన్వీనర్ కాలవ సన్నన్న సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట మండలాల్లోని ఆయకట్టు రైతులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో ఇరిగేషన్ డీఈలు, ఏఈలు పాల్గొంటారని, రైతుల ఆమోదం మేరకు సాగునీరు విడుదల చేస్తారని తెలిపారు.

ఇళ్ల దరఖాస్తుకు గడువు పొడిగింపు

డీ.హీరేహాళ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ 2.0 పథకం కింద నూతన గృహాల కొరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు సమయాన్ని పొడిగించినట్లు మండల హౌసింగ్ ఏఈ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. అర్హులు గ్రామ సచివాలయంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

● బెళుగుప్ప : ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల మంజూరుకు సర్వే నిర్వహించడానికి ప్రభుత్వం ఈ నెల 14వ తేది వరకు గడువు పొడిగించినట్లు హౌసింగ్ ఏఈ గోపీచంద్ నాయక్ తెలిపారు.

మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

బొమ్మనహాళ్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణంలో ప్రజల సౌకర్యార్థం రూ. 12 లక్షలతో తలపెట్టిన మురుగుదొడ్ల నిర్మాణ పనులను తహసీల్దార్ మునివేలు సోమవారం ప్రారంభించారు. ఇందులో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈఈ శీనానాయక్, వీఆర్వో నాగరాజుస్వామి పాల్గొన్నారు.

ఇన్‌ఫ్లో 2,520 క్యూసెక్కులు

బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,20, ఔట్‌ఫ్లో 2,520 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.735 టీఎంసీల నీరు ఉందని, ఇక్కడి నుంచి ఫేజ్-2కు 1,634 క్యూసెక్కులు నీరు వెళ్తోందని తెలిపారు.

ఫిజియోథెరపీపై శిక్షణ

బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు, సచివాలయ సిబ్బందికి ఫిజియోథెరపీపై ఫిజియోథెరపిస్ట్ సంతోష్ కుమార్ సోమవారం శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రజలలో అవగాహన కల్పించడానికి ఈ శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో వైద్యాధికారి ప్రియాంక, సూపరింటెండెంట్ వెంకటరమణ, ఎంపీహెచ్‌ఈఓ సరోజమ్మ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఐ పోటీ

ఉరవకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో సీపీఐ తరపున పోటీ చేయడానికి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున చెన్నరాయుడు, సుల్తాన్, మల్లేష్, తిప్పయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

శెట్టూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏళ్ల తరబడి తాగునీటి సమస్య ఉంది. దీంతో వందలాది మంది విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆ పాఠశాల సిబ్బంది ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సోమవారం ఆ పాఠశాలలో బోరు వేయించగా.. నీరు పుష్కలంగా పడ్డాయి. దీంతో బద్దేనాయక్‌ను ఆ పాఠశాల సిబ్బంది అభినందించారు.

దరఖాస్తు చేసుకోండి..

బొమ్మనహాళ్/కణేకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉచిత ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇండెన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు సాయిసుధీర్ తెలిపారు. ఇప్పటివరకు ఎలాంటి గ్యాస్ కనెక్షన్లులేనివారు మాత్రమే దీనికి అర్హులన్నారు. సిలిండర్ డిపాజిట్ రూ.1700, రెగ్యులేటర్ రూ. 150, సేఫ్టీ పైపు రూ.100, గ్యాస్ బుక్ 25, ఇన్‌స్టాలేషన్ చార్జీలు రూ.75 మొత్తం రూ.2025ను ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తుందన్నారు.

మురుగు కాలువ పనుల పరిశీలన

తాడిపత్రి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాసపురంలో రూ. 18 లక్షలతో చేపట్టిన మురుగు కాలువ పనులను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. సాయంత్రం మెయిన్‌బజారులో పర్యటించి.. సమస్యలపై ఆరా తీశారు.

యూపీఎస్ సీఐగా శ్రీనివాసులు



శ్రీనివాసులు

యాడికి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): యాడికి యూపీఎస్ (అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్) సీఐగా ఆర్. శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి సీఐ ఈరన్న వీఆర్‌కు వెళ్లిన విషయం విదితమే.

● కళ్యాణదుర్గంరూరల్: రూరల్ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా గణేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వంశీకృష్ణను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న గణేష్‌ను ఇక్కడ నియమించారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం

పామిడి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన క్రీడాకారులు రాఖీ, అనూష ఉత్తరప్రదేశ్‌లో ఈనెల 8 నుంచి 12 వరకూ నిర్వహించే జాతీయస్థాయి అండర్-17 కుస్తీ పోటీల్లో పాల్గొంటున్నారు. దీంతో రాఖీ, అనూషకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మనవడు, టీడీపీ మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ కుమారుడు గుమ్మనూరు ఈషన్ సాయి రూ.35వేలు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. అలాగే అనూషకు బీజేపీ యువనేత రాజశేఖర్ గౌడ్ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి అజేష్ యాదవ్ రూ. 10వేలు అందించారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

బొమ్మనహాళ్, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీధరఘట్టలో శ్రీ దత్త ఆశ్రమంలో దత్త జయంతి మహోత్సవాలు నాలుగో రోజైన సోమవారమూ కొనసాగాయి. వేదపండితులు అభిషేకం, హోమాలు నిర్వహించారు. రాత్రి పల్లకిసేవ, భజనలు, నామ సంకీర్తనలు చేశారు.

వర్రీ తొలగేనా..!

- మెరుగైన దిగుబడితో రైతుల ఆనందం
- విక్రయానికి సిద్ధంగా ధాన్యం
- కొనుగోలు కేంద్రం కోసం ఎదురుచూపు
- ధరలు తగ్గించేందుకు దళారులు, వ్యాపారుల కుమ్మక్కు



బొమ్మనహాళ్ వద్ద కోతకు సిద్ధంగా ఉన్న వరి మడి



కణేకల్లులో ఆరబోసిన ధాన్యం

కణేకల్లు/బొమ్మనహాళ్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ఆయకట్టులో రైతులు పండించిన వరి ధాన్యం విక్రయానికి సిద్ధంగా ఉంది. ఈ సారి దిగుబడి కూడా ఆశాజనంగా ఉంది. హెచ్చెల్సీ ఆయకట్టు కింద నీటి ఆధారంగా కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో ఈ పంట విస్తరంగా సాగుచేశారు. ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురిసిన నేపథ్యంలో సకాలంలో హెచ్చెల్సీ కాలువకు సాగునీరు వచ్చాయి. దీంతో నార్లుపోయడం, నాట్లు వేయడం జరిగిపోయంది. మొదట్లో యూరియా కొరత ఉన్నప్పటికీ.. వర్షాలు సమృద్ధిగా కురవడంతో వరికి మంచి జరిగింది. 10 రోజుల నుంచి హెచ్చెల్సీ ఆయకట్టులో పండిన ధాన్యాన్ని కోతలు కోస్తున్న రైతులు వాటిని పలుచోట్ల ఆరబెట్టుకుంటూ కొనుగోలు ధర కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ఏర్పాటు చేస్తుందా అని వేచిచూస్తున్నారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో ఈ ఏడాది దాదాపు 35 వేల ఎకరాల దాకా హెచ్చెల్సీ ఆయకట్టు కింద పంటలు సాగుచేశారు. జిల్లాలోనే ధాన్యాగారంగా ఉన్న కణేకల్లు వరికి, బియ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. ఈ ఏడాది కూడా సకాలంలో పంట చేతికిరాగా మార్కెట్‌లో క్వింటాలు వరి రూ.2200 వరకు ధర పలుకుతోంది.

● **దళారుల కుట్ర..:** రైతులకు ప్రభుత్వం రూ.2389 మద్దతు ధర ప్రకటించింది. రైతు కష్టానికి తగ్గ న్యాయం జరగాలంటే ఈ ధర అమలు కావాలి. కానీ గ్రామాల్లో దళారులే ధరను నిర్ణయించే స్థితి ఏర్పడింది. దళారులు, వ్యాపారులు కుమ్మక్కై ధరలను తగ్గించేందుకు కుట్రలు చేస్తున్నారు. క్వింటాల్ రూ 2100, రూ. 2200 వరకు నిర్ణయించారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖరీఫ్, రబీసీజన్‌లో వరికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ ఏడాది కూడా ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేయాలి



నాకు 2.5 ఎకరాల పొలంలో సోనావరిని పండించాను. మాగాణి భూముల నుంచి ట్రాక్టర్ల ద్వారా నేరుగా కణేకల్లు హైస్కూల్ గ్రౌండ్ నందు నిలువ ఉంచాము. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మా ధాన్యాన్ని విక్రయించుకుంటాం.

-నాగరాజు, రైతు, కణేకల్లు

రూ. 2,200కి అడుగుతున్నారు



వరిధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ రూ. 2200కు అడుగుతున్నారు. అది కూడా నెలరోజుల తరువాత డబ్బులు ఇస్తారట. ఒక వేళ నగదు వెంటనే కావాలంటే రూ. 2100 ఇస్తారట. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

-గౌస్, రైతు, కణేకల్లు







బెళుగుప్ప: ఎర్రితాత ఆలయంలో గీతాపఠనం, పామిడి: తగ్గు దేవాలయంలో దీపాలంకరణ, రాయదుర్గం: విశ్వమాత ఆశ్రమంలో..

భక్తిశ్రద్ధలతో గీతాజయంతి

బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలో గీతా జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అంకంపల్లి శ్రీకృష్ణ ఆలయంలో శ్రీ కృష్ణుడు మూలవిరాట్‌కు యలగలవంక, గుండ్లపల్లి గొల్లలదొడ్డి, రామసాగరం ప్రత్యేక పూజలు చేశారు. బెళుగుప్పలో యర్రితాత ఆలయంలో శ్రీకృష్ణుడి విగ్రహానికి పూజలు చేసి శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థులు భగవద్గీత పఠించారు.

● పామిడి : స్థానిక అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి(తగ్గుదేవాలయం)ఆలయంలో గీతా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ అష్టోత్తర శత నామావలి పఠించారు. భగవద్గీత పారాయణం చేశారు.

● రాయదుర్గంరూరల్: మండలంలో శ్రీవిప్రమలై లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలోని విశ్వమాత ఆశ్రమంలో గీతాజయంతి ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. నారాయణ హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను ఆ ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ అధ్యక్షుడు బీఎన్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షుడు ధర్మన్న, కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం

యాడికి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని సోమవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అయ్యప్పమాలాధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామిపాటలు పాడుతూ భక్తిపారవశ్యంతో నృత్యం చేస్తూ స్వామివారి ఉత్సవమూర్తిని ఊరేగించారు.

● తాడిపత్రి: పట్టణంలో సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వామిని పట్టణంలో ఊరేగించారు. గ్రామోత్సవంలో అయ్యప్పస్వామి మాలాధారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సేంద్రియానికే సై

- అన్నదాతల ఆసక్తి
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- తగ్గిన ఖర్చులు.. పెరిగిన దిగుబడి

కళ్యాణదుర్గం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పంటలకు రసాయనిక ఎరువులు వాడకం ద్వారా కలుగుతున్న అనర్థాలపై రైతుల్లో చైతన్యం వచ్చింది. రసాయనిక ఎరువుల వాడకంతో పంట పెట్టుబడి, ఖర్చులు కూడా భారీగా వస్తున్నాయి. భూసారమూ నానాటికీ తగ్గిపోతోంది. చీడపీడలు అధికమవుతున్నాయి. దీంతో రైతులు సేంద్రియ ఎరువుల వాడకంపై మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం కూడా వ్యవసాయశాఖాధికారుల ద్వారా వారికి తగు సూచనలు సలహాలు ఇస్తూ ప్రోత్సహిస్తోంది. దీంతో రానురాను సేంద్రియ ఎరువులకు డిమాండ్ పెరుగుతోంది. చెత్త ద్వారా సంపద సృష్టి కార్యక్రమం ద్వారా సేంద్రియ ఎరువులను రైతులకు అందుబాటులోకి తెస్తోంది. రైతులు భూసారాన్ని పెంపొందించుకునే పశువుల పేడ కుంటలు, మేక, గొర్రెల పేడలు పొలాలకు తోలుతున్నారు. మరికొందరు రైతులు పాడి ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. వేరుశెనగ పంటతో పాటు కర్బూజా, కళింగర, టమోటా, గెనసగడ్డ, బొప్పాయి, మిర్చి, బీర పంటలకు కూడా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తున్నారు. ఈ ఎరువులు వాడడం వలన వ్యవసాయ ఖర్చులు తగ్గడమే కాకుండా పంట దిగుబడి పెరుగుతోంది.



పొలంలో వేసిన సేంద్రియ ఎరువు

సేంద్రియ ఎరువులే మేలు



సేంద్రియ ఎరువుల వాడకంతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు వస్తాయి. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల వాడకం వల్ల భూమి గట్టి పడి పంటలకు రోగాలు ఎక్కువ వచ్చేవి. పశువుల పేడ వాడకంతో భూమి గుల్ల బారి ఎక్కువ కాలం భూమిలో సత్తువ ఉంటోంది. రోగాలు కూడా తగ్గాయి. అధిక అధిక దిగుబడి వస్తోంది. అందుకే ఏటా పశువుల ఎరువులనే నేను వాడుతున్నా.

-రామాంజనేయులు, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

మంచి దిగుబడి



కర్బూజ, కళింగర పంటలకు సేంద్రియ ఎరువులు ఉపయోగిస్తే మంచి దిగుబడి వస్తోంది. ముఖ్యంగా ఈ పంటలకు ఎటువంటి తెగుళ్లు రాకుండా ఈ ఎరువులు బాగా ఉపయోగపడుతాయి. పేడ ఎరువుకు కూడా మంచి డిమాండ్ ఉంది. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో సేంద్రియ ఎరువులకు ఆయా ప్రాంతాల్లో మంచి రేటు పలుకుతోంది. అంతేకాకుండా ఈ ప్రాంతాల్లో కర్బూజ పంటలను సాగు చేసిన రైతులు కూడా చాలామంది ఉన్నారు.

-హరీష్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

లాభాలు అనేకం

సేంద్రియ ఎరువు వాడకం ద్వారా రైతుకు అనేక లాభాలు చేకూరుతాయి. పశువుల పేడ చెత్తతో కూడిన సేంద్రియ ఎరువు వాడకం వల్ల పంట పొలాల్లో ఎక్కువ కాలం భూమిలో తేమ ఉంటుంది. తేమ ఉండడం వలన చీడపురుగులు నశిస్తాయి. తెగుళ్లు కూడా తక్కువే. రైతుకు తక్కువ ఖర్చు అధిక ఫలసాయం లభిస్తుంది.

-ఎల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం డివిజన్

పింఛన్ల పంపిణీ

గుంతకల్లు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వ వార్డులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ నయ్యాం అహ్మద్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, కౌన్సిలర్లు ప్రభాకర్, రంగన్న, పత్తి హిమబిందు, రామన్న చౌదరి, హనుమంతు, యుగంధర్, గుజరీ మహమ్మద్ ఖాజా, అంజి, రామరాజు యాదవ్, కొలిమి రామాంజనేయులు పాల్గొన్నారు.

●తాడిపత్రి: స్థానిక భగత్‌సింగ్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన పింఛన్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, కౌన్సిలర్లు మల్లికార్జున, విజయ్‌కుమార్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

●పుట్లూరు: మండలంలోని కడవకల్లు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పాల్గొన్నారు. అనంతరం సుబ్బరాయసాగర్‌ను పరిశీలించారు. మండలంలోని మూడుచెరువులకు హెచ్చెల్సీ నీరు తప్పకుండా విడుదల చేయిస్తామని తెలిపారు.

●గుత్తి: పట్టణంలో 13, 15, 22వ వార్డులలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పాల్గొన్నారు. ఇందులో మున్సిపల్ కమీషనర్ జబ్బర్‌మీయా, టీడీపీ నాయకులు చికెన్ శీనా, సుంకన్న, సుధాకర్, పవన్‌యాదవ్, వీరన్న, క్రిష్టయ్య పాల్గొన్నారు.







గుంతకల్లులో ఎమ్మెల్యే గుమ్మనూరు, తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, కడవకల్లులో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యాలు

చికిత్స పొందుతూ రైతు మృతి



రామాంజినేయులు(ఫైల్)

శెట్టూరు, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలం యర్రగుంట గ్రామానికి చెందిన రైతు నిజవళ్లి రామాంజినేయులు (55) అనంతపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. రామాంజినేయులు తన పొలానికి విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని సంబంధిత లైన్‌మన్‌కు తెలియజేసి గత నెల 24న ఎల్‌సీ తీసుకుని విద్యుత్ స్తంభం ఎక్కాడు. అయినా విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా చేయడంతో.. విద్యుత్ స్తంభంపై నుంచి రామాంజినేయులు కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురంలో చికిత్స పొందుతున్న ఆయన కోలుకోలేక మరణించాడని శెట్టూరు పోలీసులు తెలిపారు. అతని మృతికి విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని, కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

గ్రీవెన్స్‌కు అధికారులు డుమ్మా



గ్రీవెన్స్‌లో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు

విడపనకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం నిర్వహించి గ్రీవెన్స్‌కు ఎప్పటిలాగే అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం ఎంపీడీఓ చల్లా రాధాకృష్ణ, ఇద్దరు అంగన్‌వాడి సూపర్‌వైజర్లు మాత్రమే హాజరయ్యారు. దాదాపుగా 15 ప్రధాన శాఖలు అధికారులు రావాల్సి ఉండగా.. ఒక ఎంపీడీఓ మాత్రమే హాజరు అయ్యారు.

టీడీపీ గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న టీడీపీ పరిశీలకుడు మస్తానప్ప

యాడికి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా కృషి చేయాలని పార్టీ పరిశీలకుడు, గుంతకల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రెసిడెంట్ తలారి మస్తానప్ప కోరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. గత ఎన్నికల్లో కొన్ని బూత్‌ల్లో పార్టీ వెనుకబడడానికి గల కారణాలను ఆరా తీశారు. ఇందులో టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆదినారాయణ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, నాయకులు రుద్రమనాయుడు, తాంద్ర విక్రమ్, ఆదినారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి విద్యుత్ లైట్ల ఏర్పాటు



అమ్మవారి ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

విడపనకల్లు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గడేకల్లులో కొండపై వెలసిన చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. కొండపై వెలసి అమ్మవారి ఆలయం వద్ద వేములవాడ భీమలింగేశ్వరస్వామి తపస్సు చేశాడని, అనంతరం అక్కడి నుంచి వచ్చి కొండ కింద ఉన్న గడేకల్లులో జీవ సమాధి అయ్యాడని పురాణాలు చెబుతున్నాయి. కొండపై ఉన్న ఆలయాలకు అనేక ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం లేదు. పయ్యావుల సోదరుల ఆదేశాల మేరకు గడేకల్లు టీడీపీ నాయకులు కొండపై ఆలయాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

బెళుగుప్ప, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో గత నవంబరు 30న విశ్వ ఎడ్యూటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ లెవెల్‌లో వేదిక మ్యాథ్స్ అబాకస్ పోటీల్లో స్థానిక శ్రీనివాస విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఒకటో తరగతి విద్యార్థి సంతోష్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ ఛాంపియన్ అవార్డు, 1వ తరగతి విద్యార్థి ఆదిత్యా చంద్రరెడ్డి బెస్ట్ ఫర్ఫార్మెన్స్ అవార్డు, రెండో తరగతి విద్యార్థి జ్ఞానేశ్వర్ మూడో ర్యాంకు సాధించారు. వీరిని ఆ పాఠశాలలో సోమవారం కరెస్పాండెంట్ శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ సుమ, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ



ప్రతిభ కనబరచిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

ఉరవకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణ జిల్లాలో గత నెల 24న నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో వజ్రకరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాహుల్ నాయక్, శివప్రసాద్, దినేష్ సాయి, షబానా ప్రతిభ చాటారు. వీరిని పీడీ ఆయూబ్‌ఖాన్, హెచ్‌ఎం స్వర్ణలత సోమవారం అభినందించారు.

పెంచలయ్య హంతకులను శిక్షించాలి

గుంతకల్లుటౌన్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని ఆర్డీటీ కాలనీలో సీపీఎం నేత పెంచలయ్యను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశా రు. ఈ మేరకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బీ శ్రీనివాసులు, మారుతిప్రసాద్, రమేష్, నాగరాజు, అబ్దుల్లా పాల్గొన్నారు.